




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 257 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 08 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


ఉమ్మడి నెల్లూరు జిల్లా

## జనసేన కమిటీ రద్దు

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన కమిటీలు రద్దు చేసినట్లు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ విధివిధానాలకు భిన్నంగా జిల్లా నేతల వైఖరి ఉందని పేర్కొన్నారు. జనసేన నేతల తీరుపై మద్దతుదారుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా, నగర, మండల, గ్రామస్థాయి కమిటీలు రద్దు చేసినట్లు ప్రకటించారు. క్రమశిక్షణ లేని చోట వ్యవస్థను సక్రమంగా నిర్వహించలేమని.. కొన్నాళ్ల క్రితమే ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీలను రద్దు చేశామని గుర్తుచేశారు. కొత్త కమిటీని నియమించేవరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తామన్నారు.

సత్యనారాయణ గారూ..

# మనం సిద్ధాంతంలో కలుద్దాం!

- చంద్రబాబును చూడాలన్న కామధేనువులంక పెద్దాయన
- వైరల్ అయిన వీడియోకు సీఎం చంద్రబాబు స్పందన



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియోపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి, ఒక సామాన్య అభిమాని కోరికను తీర్చడానికి ముందుకొచ్చారు. తనను కలవాలని ఆశగా ఎదురుచూస్తున్న పెద్దాయనను ఉద్దేశించి, "సత్యనారాయణ గారూ.. రేపు సిద్ధాంతంలో కలుద్దాం" అని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శుక్రవారం పోస్ట్ చేశారు.

**అసలేం జరిగిందంటే..**

ఆంధ్రప్రదేశ్‌లోని కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడితో ఒక యువకుడు మాట్లాడిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియోలో, "చంద్రబాబును ఎప్పుడైనా చూశారా?" అని యువకుడు అడగ్గా, "ఆయన హైదరాబాద్‌లో ఉంటారని అంటారు, నేనైతే చూడలేదు" అని పెద్దాయన అమాయకంగా బదులిచ్చారు. "ఆయన్ను కలవాలని ఉందా?" అని అడగ్గా, సత్యనారాయణ గారు ఎంతో ఉత్సాహంగా, చూడాలనే కోరిక ఉందని చెప్పారు. దీంతో ఆ యువకుడు, ఈ నెల 9న ముఖ్యమంత్రి సిద్ధాంతం వస్తున్నారని, తాను తప్పకుండా కలిసేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట వినగానే సత్యనారాయణ గారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ హృద్యమైన వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి చేరింది. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, పెద్దాయన కోరికను మన్నిస్తూ నేరుగా ఆయన్నే కలుస్తానని ప్రకటించారు. సిద్ధాంతంలో తన పర్యటన సందర్భంగా సత్యనారాయణ గారిని కలవనున్నట్లు ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఒక సామాన్యుడి కోరికకు ముఖ్యమంత్రి ఇంత త్వరగా స్పందించడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాస్కో అణుశక్తి మ్యూజియంను

## సందర్శించిన మంత్రి లోకేష్



**మాస్కో (రష్యా), విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యాలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియం (మాస్కో)ను ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. ఈ మ్యూజియం 25వేల చదరపుమీటర్ల విస్తీర్ణంలో 7అంతస్తుల్లో ఉంటుంది. సోవియట్ అణు ప్రాజెక్ట్ ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి, భవిష్యత్తు శాస్త్రీయ అవకాశాల వరకు విస్తరించిన ప్రదర్శనలు మ్యూజియంలో ప్రత్యేకం. మ్యూజియంలో ఇంటరాక్టివ్ ప్రదర్శనలు, శాస్త్ర ప్రయోగశాలలు, గైడెడ్ టూర్లు ఉండటం వల్ల ఇది ప్రజలకు విజ్ఞానపరమైన అనుభవాన్ని అందిస్తోంది. 2023 నవంబర్లో ప్రారంభమైన ఈ మ్యూజియం ఇప్పటికే విశేష ప్రజాదరణ పొందింది. విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమన్వయ వేదికగా మిగతా .. 2లో..

## ఏపీఏఐఎంఎస్-2.0ను సమర్థంగా అమలు చేయాలి : అచ్చెన్నాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎరువుల పంపిణీని యాప్ సాయంతో చేపట్టే అంశంపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు. కలెక్టర్లు, జేసీలు, ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఏపీ వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ (ఏపీఏఐఎంఎస్)-2.0ను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. కొత్త విధానంతో కౌలు రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. "ఎరువుల పంపిణీపై కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలి. క్షేత్రస్థాయిలో విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలి. కృత్రిమ డిమాండ్, ఎరువుల మళ్లింపు చర్యలను అరికట్టాలి. ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి. పంట సరళి, అంచనా డిమాండ్ మేరకు ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచాలి. కృష్ణా, కాకినాడ జిల్లాల్లో ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవాలి. మిగతా 26 జిల్లాల్లో ఏపీఏఐఎంఎస్-2.0 యాప్ ద్వారా కొనుగోలు చేయాలి" అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

బి.ఆర్.టి.ఎస్.రోడ్డులో అత్యంత ఘనంగా

## పోలీసు యోగాంధ్రా కార్యక్రమం

గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆనంద ఆంధ్రప్రదేశ్ రావాలి : హోం అనిత



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 07 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ పరిధిలో బి.ఆర్.టి.ఎస్.రోడ్డు వద్ద పోలీసు శాఖలో మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించడానికి నగర పోలీస్ కమీషనర్ వి. రాజ శేఖర్ బాబు ఆద్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హోం మంత్రి అనిత హాజరయ్యారు. పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు సుమారు 5000 మంది పాల్గొని యోగాసనాలు మిగతా .. 2లో..

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)-2026కు

## రంగం సిద్ధం

జూన్ 9 నుంచి 30 వరకు విశాఖ, కడప, మంగళగిరిలో మ్యాచ్‌లు
యువ క్రికెటర్ల ప్రతిభకు వేదికగా ఏపీఎల్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ క్రికెట్ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి శ్రీకారం చుడుతూ, రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ సంబరాలకు వేదికగా నిలిచే ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)-2026 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తెలిపారు. ఆదివారం విజయవాడలోని ఏసీఏ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) తో కలిసి ఎంపీ సానా సతీష్ బాబు వివరాలు వెల్లడించారు.

**మూడు నగరాల్లో క్రికెట్ పండుగ**

ఈ ఏడాది ఏపీఎల్‌ను ఒకే ప్రాంతానికి పరిమితం మిగతా .. 2లో..

నేడు సీఎం చేతుల మీదుగా రైతులకు

## పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గంలోని సిద్ధాంతం గ్రామంలో సోమవారం నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సర్వేలు, జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలలో చోటుచేసుకున్న అనేక లోపాలు, సాంకేతిక తప్పిదాలు, భూ వివరాల అస్పష్టత కారణంగా రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో మిగతా .. 2లో..

మెట్రో విస్తరణను

## కేంద్ర మంత్రే అడ్డుకుంటున్నారు

తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి



**ఉప్పల్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు పంపితే కేంద్రం ఆమోదించడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న ఓ నేత మెట్రో విస్తరణను దిల్లీలో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి భాజపాలోనే ఉండి.. కేటీఆర్‌కు సహకరిస్తారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా.. ప్రజల కోసం పనిచేస్తానని, ఇతర పార్టీలకు కాదని వ్యాఖ్యానించారు. మెట్రోకు ఎందుకు అనుమతులు రావడం లేదో కిషన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప్పల్ భగాయత్ వేదికగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి ఈమేరకు ప్రసంగించారు. ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేయాలన్నారు. "గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్, దిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారు. యూపీలో మిగతా .. 2లో..

చిలకలూరిపేటలో రౌడీషీటర్లకు

## పోలీసుల కౌన్సెలింగ్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
ఎస్ఐ సోమేశ్వరరావు



**చిలకలూరిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సోమేశ్వరరావు రౌడీషీటర్లతో సమావేశమై వారికి మిగతా .. 2లో..




(మొదటిపేజీ తరువాయి)

మాస్కో అణుశక్తి మ్యూజియంను

# సందర్శించిన మంత్రి లోకేష్

నిలుస్తోన్న ఈ మ్యూజియంను 80 దేశాలకు పైగా చెందిన 35 లక్షల మందికిపైగా సందర్శించినట్లు నిర్వాహకులు లోకేష్‌కు వివరించారు. ఒకేసారి 2,100 మంది వరకు సందర్శకులను ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. మాస్కో ప్రభుత్వం, Rosatom స్టేట్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ మ్యూజియం అణుశక్తి చరిత్రను మాత్రమే కాకుండా, శాంతియుతపూర్వక అణు వినియోగ విజయాలను కూడా సమగ్రంగా పరిచయం చేస్తోంది.

# ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)-2026కు రంగం సిద్ధం

చేయకుండా విశాఖపట్నం, కడప, మంగళగిరి నగరాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు.

జూన్ 9-14: విశాఖపట్నం, జూన్ 17-21: కడప, జూన్ 24-30: మంగళగిరి

సెమీఫైనల్స్ & ఫైనల్: మంగళగిరి

మొత్తం ఏడు జట్లు పాల్గొనే ఈ టోర్నీ మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**యువత కలలకు వేదిక**

రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వస్తున్న యువ క్రికెటర్లకు ఏపీఎల్ గొప్ప అవకాశ వేదికగా నిలుస్తోందని తెలిపారు. స్థానిక ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇస్తూ, వారిని జాతీయ స్థాయికి తీసుకెళ్లడం లక్ష్యమన్నారు. గుంటూరుకు చెందిన యువ క్రికెటర్ రషీద్ ఇండియా-ఏ జట్టులో స్థానం సంపాదించడం రాష్ట్ర క్రికెట్ అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

**విద్యార్థులకు ఉచిత ప్రవేశం**

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచిత పాసులు అందించనున్నట్లు తెలిపారు. మ్యాచ్‌ల షెడ్యూల్‌ను విద్యాసంస్థలకు ముందుగానే అందించి, విద్యార్థులు ప్రత్యక్షంగా మ్యాచ్‌లు వీక్షించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు**

విశాఖ, కడప, మంగళగిరి వేదికల్లో అత్యాధునిక సదుపాయాలతో మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరిగే పోటీలు ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తాయని పేర్కొన్నారు. మంగళగిరిని భవిష్యత్తులో రాష్ట్ర క్రికెట్‌కు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

**క్రీడలతో పాటు సంస్కృతి వైభవం**

ఏపీఎల్‌ను కేవలం క్రికెట్ టోర్నీగా కాకుండా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక ఉత్సవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తోలుబొమ్మలాట, కోలాటం, జానపద కళారూపాలు, సంగీత-సినీ కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు.

**ప్రత్యక్ష ప్రసారం :** ఏపీఎల్ మ్యాచ్‌లు జియో స్టార్ స్పోర్ట్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా తెలుగు క్రికెట్ అభిమానులు ఈ టోర్నీని వీక్షించగలరని తెలిపారు.

**నవ్యాంధ్ర క్రీడా ప్రగతికి నాంది :** ఏపీఎల్ రాష్ట్ర క్రీడా ప్రతిభను వెలికితీసే గొప్ప వేదికగా ఎదిగిందని పేర్కొంటూ, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా అత్యుత్తమ ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మీడియా, క్రీడాభిమానులు, ప్రజలు కలిసి వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

"ఏపీఎల్-2026 కేవలం ఒక క్రికెట్ టోర్నీ కాదు...

యువత కలలకు వేదిక! రాష్ట్ర ప్రతిభకు గుర్తింపు! నవ్యాంధ్ర క్రీడా భవిష్యత్తుకు బలమైన పునాది!" మూడు నగరాలు... ఏడు జట్లు... వేలాది అభిమానులు...

ఏసీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఎల్-2026, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ క్రికెట్ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగుగా నిలవనుంది.

# పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ఉంచుకుని ప్రభుత్వం సమగ్ర రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రైతుల సమక్షంలోనే భూముల సర్వే నిర్వహించి, వారి అభ్యంతరాలను పరిశీలించి, తుది ఆమోదం పొందిన తరువాత మాత్రమే కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల ప్రక్షాళనను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుందని, రైతుల భూ హక్కులను శాశ్వతంగా పరిరక్షించే లక్ష్యంతో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని నాగరాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతి నెలా ఒక నియోజకవర్గంలో రైతులతో సమావేశమై భూ వివరాలను పరిశీలించడం, అధికారుల ద్వారా రికార్డులను చదివించడం, అనంతరం రైతుల సమక్షంలోనే పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం విశేషమన్నారు. జనవరి నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వే కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి కాగా, 6,459 గ్రామాలకు చెందిన 26.46 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రానున్న తొమ్మిది నెలల్లో మరో 10,357 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి, మొత్తం 67.32 లక్షల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. భూ పరిపాలనలో సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుడుతూ దేశంలోనే తొలిసారిగా బ్లాక్‌చెయిన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోందని నాగరాణి చెప్పారు. ప్రతి భూ యూనిట్‌కు శాశ్వత బ్లాక్‌చెయిన్ ఐడీ కేటాయించడం ద్వారా ఒకసారి నమోదైన సమాచారాన్ని ఎవరూ మార్చలేని విధంగా భద్రతా వ్యవస్థను రూపొందించారని వివరించారు. భూముల సర్వే ప్రారంభం నుంచి తుది రికార్డు రూపొందించే వరకు ప్రతి దశలో ఈ-కేవైసీని తప్పనిసరి చేయడం ద్వారా భూ యజమానుల హక్కులను మరింత పటిష్ఠం చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా రైతులకు డ్రాఫ్ట్ పాస్ పుస్తకాలను అందజేస్తారని, అందులోని వివరాలను రైతులు స్వయంగా పరిశీలించి ఈ-కేవైసీ ద్వారా ధృవీకరించిన తర్వాత మాత్రమే తుది పాస్ పుస్తకాలను ముద్రించి అందిస్తున్నామని చెప్పారు. ఈ విధానం వల్ల భూ వివాదాలు తగ్గడమే కాకుండా భూ రికార్డులపై రైతులకు పూర్తి నమ్మకం ఏర్పడుతోందని పేర్కొన్నారు. సిద్ధాంతంలో నిర్వహించనున్న కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి ఉదయం 11 గంటలకు సిద్ధాంతం చేరుకుని 'మీ భూమి-మీ హక్కు' ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసి, వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి భూ సంబంధిత సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని నాగరాణి తెలిపారు. కార్యక్రమానికి వచ్చే రైతులకు తాగునీరు, వైద్య సదుపాయాలు, రవాణా, భద్రత తదితర ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. రైతుల భూ హక్కులను పరిరక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రే అడ్డుకుంటున్నారు

గంగానది ప్రక్షాళన చేశామని అక్కడి సీఎం యోగి చెప్పుకొన్నారు. ప్రధాని మోదీ నదులను ప్రక్షాళన చేశారని భాజపా నేతలు గొప్పగా చెప్పుకొంటున్నారు. మూసీ ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారు. ఈ నెల 15 తర్వాత మా కార్యాచరణ మారుతుంది. మెట్రో విస్తరణకు ఎందుకు అనుమతి ఇవ్వరో.. రాష్ట్రంలో మొత్తం ధాన్యాన్ని ఎందుకు కొనరో.. ఆర్‌ఆర్‌ఆర్‌కు నిధులు ఎందుకు ఇవ్వరో.. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తాం. మంచి పనుల విషయంలో రాజకీయాలు చేయొద్దు. ఓఆర్‌ఆర్ లోపలే దాదాపు 1.34 కోట్ల మంది ప్రజలు ఉన్నారు. ఈ స్థాయి జనాభాకు సదుపాయాలు కల్పించడమంటే ఆషామాషీ కాదు. పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్‌ఎంసీని మూడుగా విభజించాం. కానీ.. రాజకీయ లబ్ధి కోసమే విభజించామని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజల సౌలభ్యం కోసం ఉప్పల్‌లోనే మున్సిపల్ ఆఫీసు ఏర్పాటు చేస్తున్నాం. రాజకీయంగా కిందపడిన నన్ను మళ్లీ నిలబెట్టింది మల్కాజిగిరి ప్రజలే. కేంద్రం సహకారం లేకపోవడంతో అప్పుడు ఎంపీగా అనుకున్న పనులు చేయలేకపోయాను. ఇప్పుడు ముఖ్యమంత్రిగా మల్కాజిగిరిని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకున్నాను" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**క్యూర్ యాప్ ఆవిష్కరణ**

ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన వాటిలో.. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం, ఉప్పల్‌లో వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, ఏవోసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణాలు వంటివి ఉన్నాయి. అదేవిధంగా క్యూర్-1 మొబైల్ యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులు చెల్లించే అవకాశం కల్పించారు.

# పోలీసుల కౌన్సెలింగ్

పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన సంఘటనలను మరచి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ చట్టాలను గౌరవించాలని, ప్రజల్లో భయాందోళనలు కలిగించే చర్యలకు పాల్పడకూడదని హెచ్చరించారు. పట్టణంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఏ చర్యనైనా పోలీసులు ఉపేక్షించబోరని, రౌడీషీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని ఎస్ఐ తెలిపారు. నిబంధనలు అతిక్రమించినా, నేర కార్యకలాపాల్లో పాల్గొన్నా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని, చట్టాలకు లోబడి జీవించడం ద్వారా మంచి గుర్తింపు పొందవచ్చని ఎస్ఐ సోమేశ్వరరావు రౌడీషీటర్లకు సూచించారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు యోగాంధ్రా కార్యక్రమం

అభ్యసించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని తామే కాపాడుకోవాలనే సంకల్పంతో యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతిలో వేల ఏళ్ల చరిత్ర కలిగిన యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. 2014లో ఐక్యరాజ్యసమితి వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 150కు పైగా దేశాలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. యోగాకు ప్రత్యేక ఖర్చులు అవసరం లేదని, పేదవాడు నుంచి ధనికుడి వరకు ప్రతి ఒక్కరూ కేవలం ఒక మ్యాట్‌తో యోగాను అభ్యసించవచ్చని పేర్కొన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రాలు
# కేంద్రం చేతిలో ఆర్థిక సమాఖ్య బందీ?

భారత రాజ్యాంగం మనకు ఒక అద్భుతమైన సంఘీభావ సమాఖ్య వ్యవస్థను ప్రసాదించింది. దేశంలోని భిన్న సంస్కృతులు, భాషలు, ప్రాంతీయ అస్తిత్వాలను గౌరవిస్తూ, రాష్ట్రాలకు స్వతంత్ర అధికారాలు, ప్రత్యేక శాసన పరిధులను రాజ్యాంగ నిర్మాతలు కల్పించారు. భారతదేశ వైవిధ్యమే ఈ దేశానికి అసలైన బలం అని వారు నమ్మారు. కానీ, నేడు ఆ సమాఖ్య స్ఫూర్తి తీవ్రమైన ప్రమాదంలో పడింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష విధానాలు రాష్ట్రాల హక్కులను క్రమేపీ కుదించి, వికేంద్రీకరణ సూత్రాన్నే మట్టిపాలు చేస్తున్నాయని రాజ్యాంగ నిపుణులు, వామపక్ష రాజకీయ వేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పడిన రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ కేంద్ర, రాష్ట్రాల మధ్య స్పష్టమైన అధికార విభజనను నిర్దేశించింది. విద్య, వ్యవసాయం, ప్రజారోగ్యం, పోలీసు వ్యవస్థ, స్థానిక స్వపరిపాలన వంటి కీలకమైన అంశాలు ప్రజలకు అందుబాటులో ఉండే రాష్ట్రాల పరిధిలోనే ఉండాలని రాజ్యాంగం స్పష్టం చేసింది. అయితే, గత పది సంవత్సరాల పాలనలో కేంద్ర ప్రభుత్వం ఈ లక్ష్మణ రేఖను అతిక్రమించిన సందర్భాలు అనేకం కనిపిస్తున్నాయి. ఇది కేవలం పరిపాలనాపరమైన సమస్య కాదు, ప్రాంతీయ గుర్తింపులకు, భాషలకు, సంస్కృతులకు మరియు భిన్నత్వంలో ఏకత్వమనే భారతీయ మూలతత్వానికే ముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**గవర్నర్ పదవి – ప్రజాస్వామ్య హంతకి అయిందా?**

రాజ్యాంగంలో గవర్నర్ పాత్రను రాష్ట్ర రాజ్యాంగ అధిపతిగా, కేంద్ర-రాష్ట్రాల మధ్య ఒక మైత్రీపూర్వక వారధిగా నిర్వచించారు. కానీ నేడు, ముఖ్యంగా బీజేపీయేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు కేంద్రం తరపున రాజకీయ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు పెల్లుబుకుతున్నాయి. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రజల చేత ఎన్నికైన శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు నెలల తరబడి, సంవత్సరాల తరబడి రాజ్ భవన్లలో తొక్కిపెట్టిన ఘటనలు స్పష్టమైన రికార్డులో ఉన్నాయి. చివరకు సుప్రీం కోర్టు స్వయంగా ఈ అంశంలో జోక్యం చేసుకుని, గవర్నర్ పదవి రాజ్యాంగ పరిమితులలో మాత్రమే పనిచేయాలని, సమాంతర ప్రభుత్వాన్ని నడపడానికి వీల్లేదని ఆదేశించాల్సి వచ్చింది. ఇది మనం ఎంతటి తీవ్రమైన రాజ్యాంగ సంక్షోభంలో ఉన్నామో చెప్పకనే చెప్తుంది. ప్రజాస్వామిక విధానంలో ఎన్నికైన ప్రభుత్వ నిర్ణయాలను, ప్రజల ఆకాంక్షలను అవరోధించే హక్కు రాజ్యాంగం గవర్నర్‌కు ఇవ్వలేదు. అయినప్పటికీ, నేడు గవర్నర్ పదవి కేంద్ర పాలకపక్ష రాజకీయ ఆయుధంగా మారిపోవడం రాజ్యాంగ మూల్యాలపై జరుగుతున్న నేరుగా దాడి.

**ఆర్థిక సమాఖ్య – రాష్ట్రాలు బిచ్చగాళ్ళవుతున్నాయా?**

ఆర్థిక సమాఖ్య విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా, అవమానకరంగా మారింది. జీఎస్‌టీ అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రాల స్వంత ఆదాయ వనరులు పూర్తిగా కేంద్రం చేతిలోకి వెళ్ళాయి. పన్ను వసూళ్ళలో రాష్ట్రాల వాటా నిర్ణయించే అధికారం జీఎస్‌టీ కౌన్సిల్‌కు ఉన్నప్పటికీ, కేంద్రం ఆ కౌన్సిల్‌ని తన సంఖ్యాబలంతో చిత్తానుసారం నడిపిస్తోందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. దీనికి తోడు, ఆర్థిక సంఘం సిఫారసులు సక్రమంగా అమలు కావడం లేదు. సెస్సులు, సర్ఛార్జీల పేరిట కేంద్రం వేరేగా నిధులు సేకరిస్తూ, వాటిని రాష్ట్రాలకు పంచాల్సిన అవసరం లేకుండా తన సొంత ఖజానా నింపుకుంటోంది. దీనివల్ల రాష్ట్రాలకు దక్కే నికర మొత్తం క్రమంగా తగ్గిపోతోంది. 15వ ఆర్థిక సంఘం నివేదికలను పరిశీలిస్తే, రాష్ట్రాలకు దక్కాల్సిన పన్నుల వాటాలో కేంద్రం ఏటా వేల కోట్ల రూపాయలు తక్కువ చెల్లిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రత్యేకంగా దక్షిణ భారత రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు దేశానికి ఎక్కువ పన్నుల ఆదాయాన్ని అందిస్తూ, తిరిగి కేంద్రం నుండి అతి తక్కువ వాటాను పొందుతున్నాయని గణాంకాలు నిరూపిస్తున్నాయి. అభివృద్ధి చెందిన రాష్ట్రాలను, జనాభాను నియంత్రించిన ప్రగతిశీల ప్రాంతాలను శిక్షించి, కేవలం జనాభా ప్రాతిపదికన నిధులు పంచడం ప్రాంతీయ అసమానతలను పెంచుతుంది. వామపక్ష దృక్పథంలో చూస్తే, ఇది కేంద్రీకృత పెట్టుబడిదారీ విధానానికి, ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు రాష్ట్ర ప్రభుత్వాలను పూర్తిగా లొంగదీసే ఒక ప్రమాదకరమైన కుట్ర.

**NIA, ED, CBI – దమన సాధనాలుగా మారాయా?**

రాజ్యాంగం ప్రకారం పోలీసు వ్యవస్థ, శాంతిభద్రతలు పూర్తిగా రాష్ట్రాల పరిధిలోని అంశాలు. కానీ కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఎన్ఐఏలు విపక్ష ముఖ్యమంత్రులను, ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయనే ఆరోపణలు దేశవ్యాప్తంగా వినబడుతున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందు కేంద్ర సంస్థల చురుకుదనం ఒక్కసారిగా పెరిగిన సంఘటనలను మీడియా పదే పదే నమోదు చేసింది. ఇది కేవలం అవినీతి వ్యతిరేక పోరాటమే అయితే, అధికార పార్టీలో ఉన్న నేతలపై ఎందుకు ఇలాంటి దాడులు జరగడం లేదు? విపక్ష నేతలు అధికార పార్టీలో చేరగానే వారిపై ఉన్న కేసులు ఎలా మాయమవుతున్నాయి? రాజకీయ ఎంపిక ద్వారా సాగే ఇటువంటి పక్షపాత దర్యాప్తు న్యాయ సమానత్వ సూత్రానికే విరుద్ధం. సమాఖ్య వ్యవస్థలో కేంద్రం తన దర్యాప్తు సంస్థలను ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాలను నిర్వీర్యం చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం అంటే పరోక్షంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే.

**విద్య, వ్యవసాయ రంగాల్లో కేంద్రం ఏకపక్ష జోక్యం**

నూతన జాతీయ విద్యా విధానంని రాష్ట్రాలతో ఎలాంటి విస్తృత సంప్రదింపులు జరపకుండానే కేంద్రం ఏకపక్షంగా ప్రకటించింది. విద్య అనేది ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ, రాష్ట్రాల సాంస్కృతిక, భాషా విభిన్నతలను పట్టించుకోకుండా దేశమంతటా ఒకే రకమైన ఏకరీతి విధానాలను రుద్దడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ముఖ్యంగా హిందీ భాషా ప్రాధాన్యతను పెంచే తరహా ప్రతిపాదనలు దక్షిణ భారత రాష్ట్రాలలో బలమైన నిరసనలను రేకెత్తించాయి. ఇది భాషా రాజకీయాలను కేంద్రీకృత సాంస్కృతిక అధిపత్యానికి, ఒకే దేశం-ఒకే సంస్కృతి అనే ఎజెండాకు వాడుకోవడంగా విమర్శకులు భావిస్తున్నారు. అదేవిధంగా, 2020లో ప్రతిపాదించిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రాష్ట్రాలతో ఎటువంటి సంప్రదింపులు లేకుండా పార్లమెంటులో బలవంతంగా ఆమోదించారు. వ్యవసాయం అనేది రాష్ట్రాల జాబితాలో ఉన్నప్పటికీ, కేంద్రం లొసుగులను వెతుకుతూ ఆ చట్టాలను రుద్దింది. అయితే, దేశ చరిత్రలోనే నిలిచిపోయేలా సాగిన చారిత్రాత్మక రైతాంగ ఐక్య పోరాటం కేంద్రం అహంకారాన్ని సవాల్ చేసింది. చివరికి కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను వెనక్కి తీసుకోక తప్పలేదు. ఈ రైతాంగ ఉద్యమం ప్రజల చేతిలో ఉన్న ప్రజాస్వామ్యానికి సాధారణ ప్రజలే నిజమైన కాపలాదారులు అన్న బలమైన సందేశాన్ని ఇచ్చింది.

**రాజ్యాంగ సవరణలు, ఆర్డినెన్సులు – ప్రజాస్వామ్యానికి మోసం**

రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉంది, కానీ అది రాష్ట్రాల హక్కులను దెబ్బతీసే విధంగా ఉండకూడదని రాజ్యాంగ పీఠిక చెబుతోంది. అయినప్పటికీ, రాష్ట్ర జాబితాలోని కీలక అంశాలను క్రమంగా ఉమ్మడి జాబితాలోకి మార్చే నిశ్శబ్ద ప్రయత్నాలు జరుగుతున్నాయి. జాతీయ విద్యా సంస్థలు, ఆరోగ్య సేవల ప్రమాణీకరణ, జాతీయ స్థాయి పోలీసు నిఘా వ్యవస్థలు (బీఎస్ఎఫ్ పరిధి పెంపు) వంటివన్నీ రాష్ట్రాల పరిపాలనలో నేరుగా జోక్యం చేసుకునే దిశగా సాగుతున్నాయి. పార్లమెంట్ సమావేశాలు లేనప్పుడు అత్యవసర పరిస్థితుల కోసం ఉద్దేశించిన ఆర్డినెన్స్ అధికారాన్ని కేంద్రం దుర్వినియోగం చేస్తోంది. ఒక చట్టాన్ని ఆర్డినెన్స్ ద్వారా తీసుకురావడం, తర్వాత సభలో దానికి ఆమోదం లభించకపోయినా మళ్ళీ మళ్ళీ అదే ఆర్డినెన్సును జారీ చేయడం రాజ్యాంగ పద్ధతికి, సమాఖ్య సంప్రదాయానికి తీవ్రమైన ద్రోహం. కేంద్రం చేస్తున్న ఈ ప్రయోగాత్మక అధికార విస్తరణ వల్ల వ్యవస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకం సడలిపోతోంది.

**ప్రత్యామ్నాయ మార్గం – ప్రజల చేతుల్లో అధికారం**

సమాఖ్య స్ఫూర్తిని పునరుద్ధరించడానికి, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి కొన్ని అత్యవసర మరియు కీలకమైన చర్యలు అవసరం. రాజ్యసభ (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్) తన అసలు స్వభావమైన రాష్ట్రాల సభ గా మారాలి. ప్రస్తుతం రాజ్యసభ కేవలం పార్టీల లైన్ ప్రకారం నడుస్తోంది. రాష్ట్రాల ప్రయోజనాలను రక్షించే సాధనంగా ఇది నిలవాలంటే, రాష్ట్రాల ప్రయోజనాలకు సంబంధించిన బిల్లులపై ఓటింగ్ జరిగేటప్పుడు ఎంపీలకు పార్టీ విప్ నుండి మినహాయింపు ఇవ్వాలి .రాజ్యాంగంలో నిర్దేశించిన అంతర్-రాష్ట్ర మండలి ప్రస్తుతం నిర్జీవంగా మారింది. దీన్ని ఒక శక్తివంతమైన వేదికగా మార్చి, కేంద్ర-రాష్ట్రాల వివాదాలను, రాష్ట్రాల మధ్య వ్యాజ్యాలను ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించాలి. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలకు స్వతంత్ర హోదా కల్పించాలి. వాటి నియామకాలు, దర్యాప్తులు రాజకీయ రంగు పులుముకోకుండా ఉండేందుకు న్యాయవ్యవస్థ పర్యవేక్షణలో స్వతంత్ర బోర్డులను ఏర్పాటు చేయాల రాష్ట్రాల నుండి వసూలు చేసే పన్నులలో సముచిత వాటా తిరిగి రాష్ట్రాలకే చేరాలి. కేంద్ర పథకాల నిబంధనల పేరుతో రాష్ట్రాల ప్రాధాన్యతలను మార్చే విధానాన్ని స్వస్తి పలకాలి.

**ముగింపు:** భారత రాజ్యాంగం రాష్ట్రాలకు ఇచ్చిన హక్కులు కేంద్రం పారేసిన రాజకీయ భిక్ష లేదా ఔదార్యం కాదు అవి ఈ దేశ వైవిధ్యానికి, భిన్నత్వానికి చేసిన చట్టబద్ధమైన న్యాయం. కేంద్రం అనుసరిస్తున్న కేంద్రీకృత అధికార విధానాలు రాజ్యాంగ స్ఫూర్తికి, సమాఖ్య విలువలకు పూర్తిగా తూట్లు పొడుస్తున్నాయి. ఈ ప్రమాదకరమైన పోకడలను నిరోధించాలంటే, కేవలం చట్టసభల్లోనే కాదు, ప్రజల్లోనూ బలమైన రాజకీయ అవగాహన, చైతన్యం అవసరం. వామపక్ష ఉద్యమాలు, ప్రాంతీయ శక్తులు, పౌర సమాజం కలిసికట్టుగా ఒకే తాటిపైకి వచ్చి ఈ సమాఖ్య సంరక్షణ పోరాటంలో భాగస్వాములు కావాల్సిన సమయం ఆసన్నమైంది. ఎందుకంటే ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకు ఒకసారి ఓటు వేసే రోజు మాత్రమే కాదు అది ప్రతి రోజూ ప్రజల హక్కుల కోసం సాధించుకోవాల్సిన ఒక అమూల్యమైన సంపద.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# రాజధాని పరిపాలనలో మార్పులు

## మూడు నాలుగు గ్రామాలకు ఒక గ్రిడ్, జోన్ – ప్రత్యేక కలెక్టర్ల నియామకం

అమరావతి రాజధాని పరిపాలనలో మార్పులు చేశారు. కొత్త కమిషన్ విజయరామరాజు వచ్చిన తరువాత మొత్తం రాజధాని ప్రాంతాన్ని గ్రిడ్లుగా మార్చి తొమ్మిది జోన్లు ఏర్పాటు చేశారు. ఈ మేరకు మే నెల 26వ తేదీన కమిషనర్ విజయరామరాజు అధికారిక ఆదేశాలు జారీచేశారు. పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం అధికారులను, సిఆర్డిఏలో ల్యాండ్ పూలింగు యూనిట్లను విభజిస్తూ సిసిఎల్ఏకు, గ్రామవార్డు సచివాలయ విభాగాలకు మే నాలుగోతేదీన లేఖ రాశారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి అనుమతి రాగానే ఇటీవల అమరావతి రాజధాని ప్రాంతం మొత్తాన్ని తొమ్మిది జోన్లుగా మార్చారు. దీనిలో ప్రస్తుత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్న కొండమరాజుపాలెం రెవెన్యూను సెంట్రల్ జోన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈస్ట్ జోన్ పరిధిలోకి కృష్ణాయపాలెం, పెనుమాక, ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి ఐనవోలు, నార్త్ ఈస్ట్ జోన్లోకి లింగాయపాలెం, ఉండవల్లి, వెంకటపాలెం, నార్త్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, మందడం రెండు యూనిట్లు తీసుకొచ్చారు. నార్త్ వెస్ట్ జోన్ పరిధిలో అబ్బురాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, సౌత్ ఈస్టోకి నవులూరు 1,2 యూనిట్లు, సౌత్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి కురగల్లు రెండు యూనిట్లు, నిడమర్రు రెండు యూనిట్లు కలిపారు. వెస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుల్లూరు రెండు యూనిట్లు, అనంతవరం గ్రామాలను తీసుకొచ్చారు. అలాగే రెండోదశలో ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్గా ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బందిని నియమించారు. ఒక్కో యూనిట్కు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఓ, లైసెన్స్ సర్వేయర్, విలేజ్ సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డిజిటల్ అసిస్టెంట్ను నియమించారు. భూమి విస్తీర్ణం ఆధారంగా కొన్ని గ్రామాల్లో అదనపు సర్వేయర్లను నియమించారు. ఇవి కాకుండా రాజధాని నగరంలో ల్యాండ్స్ విభాగానికి ప్రత్యేక యూనిట్ను ఏర్పాటు చేశారు. దీనిలోనూ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తోపాటు పదిమందిని నియమించారు. అలాగే ఎపిసిఆర్డిఏ క్యాపిటల్ రీజియన్ కోసం ప్రత్యేక ల్యాండ్ యూనిట్ను ఏర్పాటు చేశారు. ఎల్పిఎస్ కోఆర్డినేషన్, గుంటూరు కలెక్టరేట్లో ప్రత్యేక్ అడ్మిన్ కార్యాలయం, నెగోషియబుల్ సెటిల్మెంట్ పాలసీ, ఆర్1 పరిధిలో వ్యవహారాల కోసం వేర్వేరు యూనిట్లును నియమించారు. వీటన్నిటితో పాటు ఇద్దరు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారులతో మరొక విభాగాన్ని నియమించారు. ఇప్పటి వరకూ గ్రామాల్లో కాంపిటెంట్ అథారిటీలే అన్ని వ్యవహారాలు చూసేవారు. ఇక నుండి జోనల్ స్థాయిలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఆయా జోన్ల పరిధిలోకి వచ్చే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాల్సి ఉంటుంది. భూ యజమానులు నేరుగా సిఆర్డిఏ కార్యాలయానికి వెళ్లకుండా ఆయా జోన్ల పరిధిలోని సమస్యలు పరిష్కరించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వల్లభనేని సురేష్, సీనియర్ జర్నలిస్టు, 9010099208

# ఎడిటర్ వాయిస్

## అంగట్లో అన్నీ ఉన్నా.. 'సీమ నేతలకు' శాపం..!

రాయలసీమలో కూటమి పార్టీలకు జోష్ కనిపిస్తోంది. నాయకుల మధ్య చిన్న పాటి తేడాలను సరిచేసు కుంటే.. ఇక తిరుగులేదన్న వాదన కూడా వినిపిస్తోంది. కానీ, ఈ చిన్న తేడానే పెద్ద సమస్యగా మారుతోంది. ప్రస్తుత బలాబలాలను గమనిస్తే.. వైసీపీ పెద్దగా దూకుడు చూపించడం లేదు. దీనికితోడు నాయకులు కూడా ఆత్మన్యూనతా భావంలోనే ఉన్నారు. ఇక, గత ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున కూటమి పార్టీలు ఇక్కడ పుంజుకున్నాయి.

రైల్వే కోడూరు, తిరుపతి నియోజకవర్గాల్లో జనసేన విజయం దక్కించుకుంది. మిగిలిన ప్రాంతాల్లో టీడీపీ విజృంభించింది. అలాగే.. బీజేపీ కూడా ధర్మవరం, జమ్మలమడుగు వంటి కీలకమైన నియోజకవర్గాల్లో సత్తాచాటింది. సో.. మొత్తంగా సీమలో కడప నుంచి చిత్తూరు వరకు కూడా కూటమి నాయకులు పుంజుకునేందుకు భారీ అవకాశం ఉంది. దీనికితోడు ప్రభుత్వం కూడా.. సీమపై పెద్ద ఎత్తున దృష్టి పెట్టింది. ఇప్పటికే ఎంవోయూ చేసుకున్న ప్రతి కంపెనీతో సమీక్ష నిర్వహించి, పెట్టుబడులు గ్రౌండింగ్ అయ్యే వరకు నిరంతరం కృషి చేస్తున్నారు.

కడపలోని కొప్పర్తి పారిశ్రామికవాడకు ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయి. జిల్లాలో పదివేల కోట్లతో ఏర్పాటుకు పరిశ్రమలతో ఒప్పందాలు జరిగాయి. రాబోయే రోజుల్లో 20 వేల కోట్ల నుంచి 30 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయి. ఇక, నీటి పారుదల విషయంలోనూ దశాబ్దాలుగా కరువు, వలసలతో వెనుకబడిన రాయలసీమను మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సీమను దేశ హరిత రాజధానిగా తీర్చిదిద్దుతున్నారు. అంటే రాజకీయంగా.. పెట్టుబడుల పరంగా సీమకు మంచి ప్రాధాన్యం ఏర్పడింది.

**మరి లోటేంటి.. ?**

అయితే.. అంగట్లో అన్నీ ఉన్నా.. సీమ జిల్లాల్లోని కూటమి నాయకుల మధ్య కలివిడి లేకపోవడం పెద్ద శాపంగా మారింది. ఒక్కరంటే ఒక్కరికి పడడం లేదు. పార్టీల్లో నాయకుల ఆధిపత్యాలు.. పంతాలు పౌరుషాలు వంటివి నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఈ పరిణామాలతో సీమలో పట్టు బిగించేందుకు.. చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలించడంలేదని



చెబుతున్నారు. మరి ఇప్పటికైనా నాయకులు కలివిడిని పెంచుకుంటారా? కలసి పనిచేయడం ప్రారంభిస్తారా? అనేది చూడాలి. ఇదే జరిగితే.. వైసీపీకి ఇక, దాదాపు నూకలుచెల్లినట్టేనని అంటున్నారు పరిశీలకులు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




మైదుకూరు మున్సిపాలిటీ ఇందిరమ్మ కాలనీలో

## యువకుడు దారుణ హత్య



**మైదుకూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు నాగేంద్ర అనే యువకున్ని దారుణంగా మొహంపై పొడిచి హత్య చేసిన దుండగులు. మృతుడికి భార్య కుమార్తె ఉన్నారు. భార్య మనస్పర్థలుతో అమ్మగారి ఇంటి వద్ద ఉంటుందనీ తెలిపిన స్థానికులు. ఆటో డ్రైవర్, కూలి పని చేసుకుంటూ గుడి ఆవరణలో పడుకునే వాడని తెలిపిన స్థానికులు. సంఘటన స్థలానికి చేరుకున్న మైదుకూరు అర్బన్ సీఐ రమణారెడ్డి, ఎస్ ఐ చిరంజీవి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ప్రొద్దుటూరులో రూ.1000 విషయమై గొడవ..

**ఆరుగురిపై కేసు నమోదు..!**

**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రొద్దుటూరు మోడంపల్లి బైపాస్లోని ఖలీల ఫంక్షన్ హాల్ వెనుక నిన్న రాత్రి ఆరుగురు యువకులు ఘర్షణ. రూ.1000 బాకీ విషయమై నలుగురు యువకులు ఒకవైపు ఇద్దరు ఒకవైపు రెండు వర్గాలుగా ఏర్పాడి ఘర్షణ పడ్డారు. దీంతో యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. అరుగురి పై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

## లొంగిపోయిన సీఐ చినమల్లయ్య

**14 రోజుల రిమాండ్ విధింపు**



**వినుకొండ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీసు శాఖకే సవాలుగా మారి, 38 రోజులుగా తప్పించుకు తిరుగుతున్న సీఐ చినమల్లయ్య ఎట్టకేలకు శనివారం ఉదయం 5 గంటలకు వినుకొండ పోలీసుస్టేషన్‌కు వచ్చి లొంగిపోయారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం బ్రాహ్మణపల్లిలో చినమల్లయ్య తనపై అత్యాచారం చేశారని ఓ మహిళ ఏప్రిల్ 29న పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదుకావడంతో తర్వాత సస్పెండయ్యారు. అప్పటినుంచి తప్పించుకు తిరుగుతున్న ఆయనను పట్టుకోవడానికి మూడు బృందాలను ఏర్పాటుచేసినా ఫలితం లేదు. ఈ నెల 3న సీఐ చినమల్లయ్యను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. సుప్రీంకోర్టులోనూ ముందస్తు బెయిల్ తిరస్కరించడంతో లొంగిపోవడానికి గురువారం వినుకొండ కోర్టుకు వచ్చారు. న్యాయమూర్తి సెలవులో ఉండటంతో పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నారు. శనివారం వినుకొండ పోలీసుస్టేషన్‌కు వచ్చి లొంగిపోయారు. సాయంత్రం వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షల అనంతరం చిలకలూరిపేట కోర్టుకు తీసుకెళ్లారు. ఉదయం 11.50 గంటలకు అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రభాకర్ తెలిపారు. చినమల్లయ్యకు చిలకలూరిపేట జూనియర్ సివిల్ జడ్జి నరేంద్రరెడ్డి 14 రోజులు రిమాండ్ విధించారు. వినుకొండ జడ్జి సెలవులో ఉండటంతో పోలీసులు ఆయన్ను చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో గుంటూరు జైలుకు తరలించారు.

## పెన్నా నదిలో నీట మునిగిసన ఇద్దరు వ్యక్తులు



**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** సరదాగా స్నానానికి వెళ్లి.. పెన్నా నదిలో కొట్టుకుపోయిన ఇద్దరు...కళ్యాణ్ కుమార్ మృతదేహం లభ్యం.. వెంగమ్మ కోసం గాలింపు వివరల్లోకి వెళితే... మైలవరం మండలం వేపరాల గ్రామం సమీపంలోని పెన్నా నదిలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. తొర్రివేముల గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు సరదాగా స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు కళ్యాణ్ కుమార్ (25), అతని అత్త వరస వెంగమ్మ (45) నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న స్థానికులు, అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాలింపుల్లో కళ్యాణ్ కుమార్ మృతదేహాన్ని వెలికితీయగా, వెంగమ్మ కోసం ఇంకా గాలింపు కొనసాగుతున్నది.

## బండారులంకలో రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

**బండారులంక, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం మండలం బండారులంక గ్రామ పరిధిలోని నిమ్మకాయల వెంకటేశ్వరరావు ఇంట్లో విజిలెన్స్ అధికారులు సోదాలు. భారీ మొత్తంలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తింపు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్. సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ భారతి, వీఆర్వో రాంబాబు ఆధ్వర్యంలో సోదాలు జరుగుతున్నాయి.



## కేపీహెచ్‌బీలో పబ్‌పై రైడ్..

**పోలీసుల అదుపులో 9 మంది**




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పబ్బులో కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో పోలీసులు అర్ధరాత్రి సోదాలు నిర్వహించారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత కూడా కింగ్స్ & క్వీన్స్ పబ్బు నిర్వహిస్తున్నట్లు గుర్తించి చర్యలు చేపట్టారు. అక్కడ ఉన్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు.

## మందమర్రిలో ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు బోల్తా



**మందమర్రి, విశ్వం వాయిస్ న్యూస్ :** మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కొత్తగూడెం నుంచి బెల్లంపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు మందమర్రికి చేరుకోగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు నియంత్రణ కోల్పోయి.. జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డుపైకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ఓ ప్రయాణికునికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు వారి వారి గమ్యస్థానాల్లో దిగిపోవడం.. చివరగా ఒక్క ప్రయాణికుడే బస్సులో ఉండటంతో ప్రాణ నష్టం తప్పింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

## ఇన్వర్టర్ నుంచి విద్యుత్తు సరఫరా..

**స్తంభంపైనే ప్రాణాలొదిలిన కార్మికుడు**



**ఆదిలాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపాధి కోసం ఎన్నో రాష్ట్రాలు దాటి వలస వచ్చిన కార్మికుడు.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై దుర్మరణం పాలైన విషాద ఘటన ఆదిలాబాద్‌లో శనివారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి.సునీల్‌కుమార్, విద్యుత్తుశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. ఝార్ఖండ్‌కు చెందిన యాదవ్ సురేష్ (24) ఆదిలాబాద్ పట్టణంలో ఓ గుత్తేదారు దగ్గర పనులు చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం రాణిసతీజీ కాలనీలో విద్యుత్తు స్తంభంపై తీగలు సరిచేయటానికి స్తంభం ఎక్కాడు. అంతకుముందే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కానీ ఓ ఇంటి ఇన్వర్టర్ నుంచి తను సరి చేస్తున్న తీగలకు విద్యుత్తు సరఫరా అయింది. ఆ విషయం తెలియక తీగలు సరి చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై స్తంభంపైనే ప్రాణాలు విడిచాడు. సహచర కార్మికులు మృతదేహాన్ని కిందికి దింపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## భార్య, అత్తామామల దాడి.. ఆర్మీ ఉద్యోగి మృతి

**మెదక్, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణంలోని మిలిటరీ కాలనీలో ఆర్మీ ఉద్యోగి హత్యకు గురయ్యాడు. ఆర్మీలో సుబేదార్‌గా ఉన్న పొన్నం కుమార్‌గౌడ్ (49)ను అతడి భార్య, అత్తామామలే అంతమొందించారు. ఉత్తరాఖండ్‌లో విధులు నిర్వహిస్తున్న కుమార్‌గౌడ్.. సెలవులపై నెలక్రితం ఇంటికి వచ్చాడు. 15 రోజుల క్రితం భార్య పద్మతో గొడవపడ్డాడు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో కుమార్ ఇద్దరు మహిళలను ఇంటికి తీసుకొచ్చాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న అతడి భార్య.. పుట్టింటి నుంచి తిరిగివచ్చారు. అర్ధరాత్రి కుమార్‌పై భార్య, అత్తామామ, బావమరిది కలిసి దాడి చేశారు. దీంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఒక్కసారి దర్శిస్తే చాలు..! తెలంగాణ వైద్యనాథుడి మహిమ.. వ్యాధులు గయాబ్!

తెలంగాణలో ఆధ్యాత్మిక చరిత్రను మోస్తూ నిలిచిన ఒక అరుదైన శివక్షేత్రం ఉంది. అదే చందిప్ప గ్రామంలో వెలసిన మరకత సోమేశ్వర స్వామి ఆలయం. ఈ క్షేత్రం గురించి తెలిసినవారు దీనిని "ఆరోగ్యాన్ని ప్రసాదించే శివక్షేత్రం"గా భావిస్తారు. భక్తి, విశ్వాసం, చరిత్ర.. కలిసిన ఈ పవిత్ర స్థల విశేషాలను కథనంగా చూద్దాం. తెలంగాణలోని అనేక శైవక్షేత్రాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నది చందిప్ప గ్రామంలోని మరకత సోమేశ్వర స్వామి ఆలయం. పచ్చని ప్రకృతి నడుమ, నిశ్శబ్ద వాతావరణంలో వెలసిన ఈ క్షేత్రం భక్తి, చరిత్ర, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా నిలుస్తోంది. సాధారణ ఆలయంలా కనిపించినా... లోపల దాగి ఉన్న విశిష్టతలు దీనిని అరుదైన క్షేత్రంగా నిలబెడతాయి. ఈ ఆలయంలో ప్రధాన విగ్రహంగా ఉన్న శివలింగం "మరకత లింగం"గా ప్రసిద్ధి చెందింది. మరకతం అంటే పచ్చ రత్నం. ఈ లింగం పచ్చటి వెలుగును వెదజల్లుతూ భక్తులను ఆకర్షిస్తుంది. పురాణాల ప్రకారం, ఈ లింగాన్ని దర్శించడమే కాదు, దాని ముందు ధ్యానం చేస్తే మనసుకు ప్రశాంతత, శరీరానికి ఆరోగ్యం లభిస్తాయని నమ్మకం. అందుకే ఈ క్షేత్రాన్ని "ఆరోగ్యాన్ని ప్రసాదించే శివక్షేత్రం"గా భక్తులు విశ్వసిస్తున్నారు. పురాణాల ప్రకారం పరమేశ్వరుడు తన భక్తులకు కృప చూపేందుకు ద్వాదశ జ్యోతిర్లింగాలుగా అవతరించాడని చెబుతారు. మహారాష్ట్రలోని వైద్యనాథ జ్యోతిర్లింగం భక్తులకు ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడనే నమ్మకం విస్తృతంగా ఉంది. అదే మహిమను పోలిన మరకత శివలింగం తెలంగాణలోని చందిప్ప గ్రామంలో దర్శనమివ్వడం ఈ క్షేత్రాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెట్టింది. ఈ శివలింగం సాధారణ లింగాల్లా కాకుండా, పూర్తిగా మరకత రత్నంతో రూపొందినదిగా కనిపిస్తుంది. గాఢమైన ఆకుపచ్చ కాంతి వెదజల్లుతూ భక్తులకు దైవానుభూతిని కలిగిస్తుంది.

**చరిత్రలోకి ఓ చూపు..**

చందిప్ప క్షేత్రానికి దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. ముచుకుంద నది తీరాన ఉన్న ఈ పవిత్ర స్థలంలో పశ్చిమ చాళుక్య రాజు విక్రమాదిత్యుడు 11వ శతాబ్దంలో ఈ లింగాన్ని ప్రతిష్ఠించినట్లు శాసనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా కార్తిక మాసంలో జరిగిన ప్రతిష్ఠా మహోత్సవం ఈ క్షేత్ర ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. కాలగమనంలో ఆలయం శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ,







భక్తుల కృషితో ఇటీవలి కాలంలో పునరుద్ధరించబడింది. కొత్త గర్భగుడి నిర్మాణంతో ఆలయానికి మళ్లీ పూర్వ వైభవం వచ్చింది.

**ఆలయ విశేషాలు**

గర్భగుడిలోని మరకత లింగం ప్రత్యేక ఆకర్షణ. లింగం నుంచి వెలువడే ప్రకాశం ఆధ్యాత్మిక శాంతిని కలిగిస్తుంది. ఆలయ ప్రాంగణం ప్రశాంతంగా, ధ్యానానికి అనుకూలంగా ఉంటుంది.

**సూర్య కిరణాల రహస్యం**

2007లో మహాశివరాత్రి సందర్భంగా జరిగిన ఒక విశేష సంఘటన ఈ క్షేత్రానికి మరింత ఖ్యాతి తెచ్చింది. ఆ రోజు సూర్య కిరణాలు నేరుగా శివలింగంపై పడటంతో, అది మరకత లింగమని స్పష్టంగా తెలిసింది. అప్పటి నుంచి ఈ ఆలయం భక్తుల దృష్టిని ఆకర్షిస్తోంది.

**ఐదు సోమవారాల వ్రతం.. పూజలు, విశ్వాసాలు..**

**శివుడు అభిషేకప్రియుడు. ఇక్కడ భక్తులు కొన్ని నియమాలతో పూజలు చేస్తారు:**

ఐదు సోమవారాలు లేదా పౌర్ణములు అభిషేకం చేస్తే కోరికలు నెరవేరుతాయని నమ్మకం పౌర్ణమి రోజున అభిషేక జలాలతో స్నానం చేస్తే పాపక్షయమని విశ్వాసం. బ్రాహ్మీ ముహూర్తంలో పూజిస్తే శివకటాక్షం త్వరగా లభిస్తుందని చెబుతారు. ప్రతిరోజూ త్రికాల పూజలు, హారతులు జరుగుతాయి. శ్రావణం, కార్తిక మాసాలు, మహాశివరాత్రి వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు.

**క్షేత్ర రక్షకుడు**

ఈ ఆలయానికి కాలభైరవుడు క్షేత్రపాలకుడిగా భావిస్తారు. ఆదివారం ఆయనను దర్శిస్తే గ్రహదోషాలు తొలగుతాయని భక్తులు నమ్ముతారు. అలాగే సుబ్రహ్మణ్య స్వామి సర్పరూపంలో ఆలయంలో సంచరిస్తాడనే విశ్వాసం కూడా ఉంది.

**దర్శన ఫలం**

ఈ క్షేత్రంలో శివుని దర్శించుకుంటే.. అనారోగ్య సమస్యలు తగ్గుతాయని, మనశ్శాంతి కలుగుతుందని, ఐశ్వర్యం, సౌభాగ్యం లభిస్తాయని భక్తుల విశ్వాసం.

**ఎలా చేరుకోవాలి?**

ఈ పవిత్ర క్షేత్రం హైదరాబాద్‌కు సుమారు 48 కిలోమీటర్ల దూరంలో ఉంది. రహదారి మార్గంలో సులభంగా చేరుకోవచ్చు. చందిప్ప మరకత సోమేశ్వర స్వామి ఆలయం కేవలం ఒక దేవాలయం కాదు. అది విశ్వాసానికి నిలువెత్తు ప్రతిరూపం. ఆరోగ్యం, ఆధ్యాత్మిక శాంతి కోరుకునే వారికి ఇది ఒక విశేషమైన దైవక్షేత్రం. భక్తితో ఒకసారి దర్శిస్తే, ఆ అనుభూతి మనసులో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...

కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
సోమవారం, 08 జూన్, 2026

www.viswamvoice.com

## మండలంలో తీరని
# "బంకా"సురుల మట్టి దాహం..!

○ మే 10 నుండి నేటికీ సుమారు నెలరోజులుగా.. ○ నిరాటంకంగా, బహిరంగంగానే అక్రమ మట్టి తవ్వకాలు..
○ చూస్తూ కాలం గడుపుతున్న అధికార యంత్రాంగం




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండల పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు రోజురోజుకూ పెరుగుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది వేసవిలో వర్షాలు కురవకపోవడాన్ని అవకాశంగా మార్చుకున్న అక్రమార్కులు మట్టి దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మే నెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ తవ్వకాలు జూన్ నెలలోనూ నిరాటంకంగా కొనసాగుతుండటం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. ప్రధానంగా గ్రామ శివార్లు, వ్యవసాయ భూములు, చెరువుల పరిసర ప్రాంతాల్లో భారీ యంత్రాలతో మట్టిని తరలిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రింబవళ్లు ట్రాక్టర్లు, టిప్పర్లు తిరుగుతున్నా సంబంధిత శాఖలు కేవలం హెచ్చరికలకే పరిమితమవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇటుక బట్టీలకు అధిక సంఖ్యలో తరలించిన మట్టిని ఎత్తుగా నిల్వ చేసి, అనంతరం రోడ్ రోలర్ల సహాయంతో అనగదొక్కుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీన్ని బట్టి మండలంలో ఇటుక బట్టీల కోసం ఏ స్థాయిలో మట్టి తవ్వకాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "చర్యలు తీసుకుంటాం", "తనిఖీలు చేస్తాం" అనే మాటలు తప్ప, ఎలాంటి కఠిన చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అధికారులు మామూళ్ల మత్తులో విధులను గాలికి వదిలేశారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వేసవిలో వర్షాలు లేకపోవడంతో మట్టి ఎండిపోవడం అక్రమ తవ్వకాల మాఫియాకు అనుకూలంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. "అందిన కాడికి దోచెయ్" అన్నట్లుగా అక్రమార్కులు ఎక్కడ పడితే అక్కడ మట్టిని తవ్వి తరలిస్తుండటంతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అంధకారంలో
# దళితవాడ సహా పలు ప్రాంతాలు

**రాయవరంలో గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం**
**మండుతున్న వేసవిలో ప్రజల అవస్థలు**


అలసిపోయి బహిరంగ ప్రాంతంలోనే నిద్రపోతున్న దళిత కాలనీవాసులు

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయాలంటూ గ్రామస్తుల డిమాండ్ తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండల కేంద్రంలో ఆదివారం రాత్రి తీవ్ర విద్యుత్ అంతరాయం ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. మండుతున్న వేసవి వేడిలో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడగా, దళితవాడ, మఠం వీధి సహా పలు ప్రాంతాలు గంటల తరబడి అంధకారంలో మగ్గాయి. గ్రామంలోని ప్రధాన రహదారి పరిసరాల్లో మాత్రం విద్యుత్ సరఫరా కొంతవరకు కొనసాగుతుండగా, పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో మాత్రమే సరఫరా నిలిచిపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "గ్రామం ఒక వైపు వెలుగుల్లో ఉండగా, మరో వైపు ప్రజలు చీకట్లో ఉండటం బాధాకరం" అని గ్రామస్తులు వాపోయారు. విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించగా, రామచంద్రపురం నుంచి సరఫరా అందించే లైన్ తెగిపోవడంతో సమస్య ఏర్పడిందని, మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్ పునరుద్ధరించడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. అయితే గ్రామస్థులు మాత్రం ఈ సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్య తలెత్తిన ప్రతిసారీ దళితవాడ వంటి ప్రాంతాలకే ఎక్కువగా విద్యుత్ కోతలు పడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రాయవరం గ్రామంలోని కొన్ని ప్రాంతాలు వెదురుపాక, వెదురుపాక సావరం వంటి గ్రామాలతో కలిపి ఏర్పాటు చేసిన ఫీడర్ పరిధిలో ఉండటంతో తరచూ అంతరాయాలు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రంగా ఉన్న రాయవరానికి ప్రత్యేక విద్యుత్ ఫీడర్ ఏర్పాటు చేస్తే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. "మండల కేంద్రానికి తగిన మౌలిక సదుపాయాలు ఉండాలి. తరచూ కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బందులు పడటం సరికాదు. దళితవాడలను నిర్లక్ష్యం చేస్తున్న భావన కలుగుతోంది" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, దెబ్బతిన్న లైన్ల మరమ్మతులు వేగవంతం చేయడంతో పాటు రాయవరానికి ప్రత్యేక ఫీడర్ మంజూరు చేసి భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వైద్యానికి ప్రాధ్యాన్యత ఇచ్చి
# ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు
### శిబిరం సక్సెస్ పట్ల మార్గాని భరత్ రామ్ హర్షం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అధికారంలో ఉన్నపుడు ఏవిధంగా ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చామో ప్రతిపక్షంలో ఉన్నా సరే, వైద్యానికి ప్రాధ్యాన్యత ఇచ్చి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మాజీ ఎంపీ వై.ఎస్.ఆర్.సి.పి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ చెప్పారు.ఇపుడు ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం ఉదయం 8గంటల నుండి స్థానిక ఆనంద్ నగర్ బెట్టి కాన్వెంట్ రోడ్డులో ఉచిత కంటి వైద్య శిబిరం భరత్ ఆధ్వర్యంలో జరిగింది. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు ఈ శిబిరంలోకంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్బంగా భరత్ మాట్లాడుతూ ఈ కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన రావడం పట్ల భరత్ ఆనందం వ్యక్తంచేసారు. రాజమహేంద్రవరంలోని 45,46వార్డులకు సంబంధించి ఈ శిబిరం నిర్వహించామని భరత్ తెలిపారు. పెద్దవాళ్ళతో పాటు చిన్నపిల్లలు కూడా ఈ శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. ఐ డ్రాప్స్, మందులు ఈ శిబిరంలో ఇవ్వడం జరిగిందని భరత్ తెలిపారు. కంటి అద్దాలు ఎవరికి అవసరమో వారికి వారం పదిరోజుల్లో అవి కూడా ఏర్పాటుచేస్తామని ఆయన అన్నారు. కేటరాక్ట్, రెటీనాకు సంబంధించి ఎవరికైనా ఆపరేషన్లు అవసరమైతే మార్గాని భరత్ ఫౌండేషన్ తో పాటు ఇతర స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో చేయించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. అధికారం ఉన్నా లేకపోయినా రాజమహేంద్రవరం ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచన చేస్తామన్నారు. ఇదేదో ఒక ప్రాంతంలో చేసి వదిలేయడం కాకుండా నిరుపేదలు ఉన్న ప్రాంతాలలో శిబిరాలు నిర్వహించే కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా చేపడతామని భరత్ చెప్పారు. వైద్య శిబిరాలతో పాటు జాబ్ మేళా కూడా నిరంతరం చేపడతామని భరత్ తెలిపారు. ఇప్పటికే రెండు విడతల జాబ్ మేళా చేశామని, మరో 20రోజుల్లో మూడవ విడత జాబ్ మేళా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇవే కాకుండా గర్భిణీలకు ప్రోటీన్ కిట్స్, ఐరన్ సిరప్ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు భరత్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ మాజీ చైర్పర్సన్ షర్మిల రెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర సెక్రటరీ వాసంశెట్టి గంగాధర్, వైఎస్ఆర్సిపి 46 వార్డ్ ఇంచార్జ్ కళ్లి మురళి కృష్ణ, ఎస్.డి. జిలాని, పులి సాగర్, మీసాల ధనరాజు, మడ్డు ధనరాజు, జానీ, సంతోష్, సుల్తాన్, సూర్య, 45వ వార్డు నాయకులు అల్లు జయరాజ్, లోవ రాజ్, బత్తిన చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

## నల్లూరు మేజర్ డ్రైన్‌లో
# గుర్రపు డెక్క తొలగింపుకు చర్యలు

**డ్రోన్లతో కెమికల్ స్ప్రేయింగ్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ళ**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో గొల్లపుంత వద్ద నల్లూరు మేజర్ డ్రైన్ లో విస్తరిస్తున్న గుర్రపు డెక్కను సమర్థవంతంగా తొలగించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్ల సహాయంతో కెమికల్ స్ప్రేయింగ్ పనులను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా కెమికల్ స్ప్రేయింగ్ నిర్వహించడం వల్ల తక్కువ సమయంలో విస్తారమైన ప్రాంతంలో సమానంగా మందు పిచికారీ చేయడం సాధ్యమవుతుందన్నారు. దీంతో గుర్రపు డెక్క వేగంగా నిర్మూలన చెందడంతో పాటు డ్రైనేజీ ప్రవాహానికి ఆటంకాలు తొలగి నీటి పారుదల వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో సైతం సురక్షితంగా పనులు నిర్వహించడం వంటి ప్రయోజనాలు ఈ డ్రోన్ల ద్వారా కలుగుతాయని ఎమ్మెల్యే వేగుళ్ళ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్స నాగు, అమలాపురం పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, బీజేపి నాయకులు కోన సత్యనారాయణ, ముత్యాల శ్రీధర్, త్రిపురశెట్టి నాని, గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, మండపేట డిసి పడాల సుబ్బారెడ్డి, కాజులూరు డిసి లకాని కృష్ణ చైతన్య, రామచంద్రపురం డిసి నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, మండపేట వైస్ డిసి కోరిపోలు సత్తిబాబు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం
### విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉత్తర్వులు ప్రకారం రాజమహేంద్రవరం దానవాయిపేట మహిళా గ్రంధాలయం, శాఖా గ్రంధాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరము ముగింపు కార్యక్రమం జీవ కారుణ్య సంఘము ఛైర్మన్ వర్రే శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగినది. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్ లో విద్యార్థులకు కథలు, పద్యాలు, వేదిక్ మ్యాథ్స్, హిందీ, డ్రాయింగ్, క్రాఫ్ట్, ధ్యానం, స్పోకెన్ ఇంగ్లీష్ మొదలైన అంశాలపై ఉపాధ్యాయులు చే శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఏప్రిల్ 28 నుండి జూన్ 2026 వరకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులుకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసరావు విచ్చేసినారు. ఆదిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటి పిల్లలు అందరూ ఎక్కువగా ఫోన్ కు అలవాటు పడుతున్నారు. ఈ విషయం నాకు బాగా నచ్చిందని అన్నారు. పిల్లలకు చెప్పే విధానం లో చెప్పితే అభివృద్ధి లోకి వస్తారన్నారు. ప్రతి విద్యార్థి గ్రంధాలయాలకు రావడం అలవాటు చేసుకోవాలని అన్నారు. రిటైర్డు తెలుగు పండిట్ ముంగండి సూర్య నారాయణ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన విధానాన్ని వివరించారు. మరొక అతిథి భారత వికాస్ పరిషత్ మాజీ అధ్యక్షులు పి.వి.ఎస్.కృష్ణారావు మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్ పిల్లలు నేర్చుకున్న అంశాలు పిల్లలు అభివృద్ధిలోకి రావడానికి ఉపయోగపడతాయని అన్నారు. మరొక అతిథి లైన్స్ క్లబ్ రామ గుప్తా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న తనం నుంచి గ్రంధాలయాలుకు రావడం ఒక దినచర్య గా చేసుకోవాలన్నారు. మహిళా గ్రంధాలయమును ఉపయోగించుకుని టీచర్, కానిస్టేబుల్ ఉద్యోగాలు వచ్చిన అభ్యర్థులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసరావు మెమోంటో, శాలువాలతో సత్కరించారు. ఈ సమ్మర్ క్యాంప్ కు హాజరైన ప్రతి విద్యార్థిని విద్యార్థులుకు ఎమ్మెల్యే మెమోంటో, సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసరావు,జీవకారుణ్య సంఘం ఛైర్మన్ వర్రే శ్రీనివాసరావు, ముంగండి సూర్య నారాయణ, పి.వి.ఎస్.కృష్ణారావు, రామ్ గుప్తా, జగపతి గారు, గంగాధరరావు, యమ్.భారతి, చిన్న లోవరాజు,పోతుకూచి కృష్ణ మోహన్, నానాజీ ,పి.వీరభద్రరావు , కిషోర్, కళ్యాణి, సంధ్యా రాణి,దేవి,బాపు, భవాని, లక్ష్మీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.లైబ్రేరియన్ అబ్బిరెడ్డి చంద్రపద్మాదేవి ఈ కార్యక్రమము ను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.ఈ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు వాళ్ళు నేర్చుకున్న కథలు పద్యాలు పాటలు గేయాలు స్తోత్రములు, డాన్సులు చేసినారు.ఈ కార్యక్రమం అనంతరం లైబ్రేరియన్ అబ్బిరెడ్డి చంద్రపద్మాదేవి వందన సమర్పణ చేశారు.

# ప్రతి ఆదివారం ప్రజా సమస్యల పరిష్కారం కొరకు
### మాజీ కార్పొరేటర్ బొమ్మనమైన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వారం వారం ఆదివారం ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అందరికి ప్రభుత్వ ఫలాలు అందించేలా మాజీ కార్పొరేటర్ బొమ్మనమైన శ్రీనివాస్ వినూత్న కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. 3వ వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ బొమ్మనమైన శ్రీనివాస్ ప్రజల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం 2017 నుండి వారం వారం ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమానికి వ్యవస్థాపకుడిగా ఉన్నట్లు తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ వద్దకు తీసుకురావాలని కోరారు.కొత్త గా ఓటు లేనివారికి, రేషన్ కార్డులు లేనివారికి కొత్తగా రేషన్ కార్డులు,ఆధార్ కార్డులో పేర్లు మార్పులు-చేర్పులు, ఇంటి చిరునామా మార్పులు, ఆధార్ కార్డులు లేనివారికి కొత్తగా ఆధార్ కార్డు ఇప్పించడం, వార్డులో శానిటేషన్ సరిగ్గా లేకపోయినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.వికలాంగులకు సదరన్ సర్టిఫికెట్ ఇప్పించి అర్హత వున్న వారికి పెన్షన్ మంజూరు చేయిస్తామని తెలిపారు. వృద్ధాప్య, వితంతువులకు ఇప్పటి వరకు పెన్షన్ రాకపోతే కొత్త పెన్షన్లు ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. ఇంటిపన్నుల పేరు మార్చుకోలేని వారికి కొత్తగా వారి పేరు మీద పన్ను వేయించడం, వీధి దీపాలు, మంచినీటి కుళాయిలు,పేదవారికి విద్య, ఇళ్ళ స్థలాలు తదితర అంశాలపై ప్రతి ఆదివారం ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమం నిర్వహిస్తామని బొమ్మనమైన శ్రీనివాస్ అన్నారు.అల్లురామలింగయ్య హాస్పటల్ ఎదురుగా ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆటోనగర్ యూనియన్ అధ్యక్షులు, 3వ వార్డ్ వైస్ ప్రెసిడెంట్ గుబ్బల శ్రీనివాస్,అండలూరి వీర వెంకట సత్యనారాయణ,బెజవాడ చిన నరసింహులు,కొనపాకుల కృష్ణ,తారల పండు, బెజవాడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలి

**జూన్ 12 నుంచి ఆదిరెడ్డి వార్డు పర్యటనలు విజయవంతం చేయండి : అనుశ్రీ సత్యనారాయణ పిలుపు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం జనసేన పార్టీ సిటీ నియోజకవర్గ ఇన్చార్జ్ అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో రెండవ రోజు 11 నుండి 30 వార్డులలో ముఖ్య నాయకులతో రాజమండ్రి జనసేన పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు త్వరలో కమిటీలు బూత్ స్థాయి నుంచి వార్డ్ కమిటీలు జిల్లా కమిటీలు గురించి దిశా నిర్దేశం చేశారు, దీంతోపాటు జూన్ 12 నుంచి రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వార్డు పర్యటనలో ప్రతి వార్డు కార్యక్రమంలో ప్రతి జన సైనికుడు ప్రతి వార్డ్ లో ఏ సమస్య ఉన్న ఎమ్మెల్యే దృష్టిలోకి తీసుకెళ్లాలని ప్రతి వార్డు జనసేన కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జనసేన పార్టీ సిటీ ఇంచార్జ్ అనుశ్రీ పిలుపునిచ్చారు.





### ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి

# యోగా ఒక అద్భుత సాధనం

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగాభ్యాసం ఎంతో అవసరమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి రైతులకు పిలుపునిచ్చారు. యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా, 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న యోగా కార్యక్రమాల తొలి దశలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో రైతులతో యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి లోనవుతున్నారని, ఆ ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించేందుకు యోగా ఒక దివ్యౌషధంగా పనిచేస్తుందన్నారు. యోగాంధ్ర-2026 కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, దీనిని ప్రజా ఉద్యమంగా మలిచి ప్రతి ఇంటికీ యోగాను చేరవేయడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. యోగాను కేవలం జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి మాత్రమే పరిమితం చేయకుండా, ప్రతి ఒక్కరి దినచర్యలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. నేటి యువత, విద్యార్థులు మానసిక ఏకాగ్రతను పెంపొందించుకోవడానికి, శారీరక దృఢత్వాన్ని సాధించడానికి ప్రతిరోజూ కనీసం 20 నుంచి 30 నిమిషాల పాటు యోగాసనాలు, ప్రాణాయామం సాధన చేయాలని సూచించారు. సమతుల్య జీవన విధానంలో భాగంగా యోగా ద్వారా శ్వాసకోశ వ్యవస్థ

**జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి**



మెరుగుపడటంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తద్వారా ఆధునిక జీవనశైలి వల్ల వచ్చే అనేక వ్యాధులను దూరం పెట్టవచ్చని తెలిపారు. యోగాంధ్ర-2026ను విజయవంతం చేయడానికి జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సందేశంతో కోనసీమ జిల్లా ప్రజలందరూ, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, రైతులు, యువత పెద్ద ఎత్తున యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాను జీవనశైలిగా మార్చుకుని ఆరోగ్యకరమైన, ఆనందకరమైన కోనసీమను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. ఆరోగ్యపరంగా నాణ్యమైన జీవనాన్ని పొందేందుకు యోగాను మన పూర్వీకులు వారసత్వంగా అందించిన అమూల్యమైన సంపదగా అభివర్ణించారు. ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక ఇతివృత్తంతో కార్యక్రమాలు ఈ నెల 21 వరకు కొనసాగుతాయని తెలిపారు. ఆరోగ్య భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. విద్యాభ్యాసంతో పాటు యోగాభ్యాసానికీ ప్రాధాన్యత ఇవ్వాలని, యువత, మహిళలు, విద్యార్థుల్లో యోగా పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర--2047 విజన్‌లో భాగంగా యోగాను ప్రజారోగ్య ఉద్యమంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, 365 రోజుల ఉద్యమంగా కొనసాగించాలని రైతులకు పిలుపునిచ్చారు. జూన్ నెల మొత్తాన్ని యోగా నెలగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయగలిగితే ఆరోగ్యవంతమైన తరాన్ని తీర్చిదిద్దగలమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వి.సుబ్బారావు, ఆర్డీఓ జి.మమ్మీ, డీఆర్డీఏ పీడీ రాంబాబు, జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ శ్యాంసుందర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.వి. రమణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.వెంకటరామారావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అమలాపురంలో ఘనంగా నిర్వహించిన ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా సైకిల్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ), అమలాపురం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వారు ఫిట్‌నెస్, ఆరోగ్యకర జీవనశైలి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సందేశాలను ప్రజలకు చేరవేశారు. నిత్య జీవితంలో వ్యాయామం, సైక్లింగ్ వంటి ఆరోగ్యకర అలవాట్లను పెంపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. యువత మాదకద్రవ్యాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణహిత రవాణా సాధనమైన సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ ర్యాలీ దోహదపడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు, పోలీసు పిల్లలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పోలీసు పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ పోలీసు శాఖ ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఈ కార్యక్రమం ద్వారా మరోసారి చాటిచెప్పింది. ఫిట్ ఇండియా ఉద్యమం ప్రధాన ఉద్దేశమైన "ఫిట్ బాడీ - ఫిట్ మైండ్ - ఫిట్ నేషన్" సందేశాన్ని ఈ ర్యాలీ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఫిట్‌నెస్, ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డీఎస్పీ, ఏఆర్ డీఎస్పీ, దిశ డీఎస్పీ, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హసన్ బాదలో ఘనంగా 'మన ఊరు - మన జెండా'

**హసన్ బాద, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'మన ఊరు - మన జెండా' కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బీజేపీ జెండా స్థూపం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు శాసనమండలి సభ్యులు, జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండల బీజేపీ అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన సోము వీర్రాజుకి స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూర్ణ కుంభం, మేళతాళాలతో అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆయన పార్టీ జెండాను లాంఛనంగా ఆవిష్కరించారు. పర్యావరణ

**పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు**



పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 'అమ్మ పేరున ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా సోము వీర్రాజు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పన్నెండు సంవత్సరాల సుపరిపాలనలో దేశవ్యాప్తంగా జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను అలాగే పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ప్రజలకు సవివరంగా తెలియజేశారు. ప్రతి గ్రామంలోనూ బీజేపీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావాలని ఆయన పిలుపునిచ్చారు. 'వారధి' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యకర్తలు అంకితభావంతో తమవంతు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా మన ఊరు - మన జెండా స్థూపం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించడం ద్వారా గ్రామస్తులు తమ ఊరి అభివృద్ధి కార్యక్రమాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని సూచించారు. కార్యక్రమం అనంతరం ముఖ్య అతిథి సోము వీర్రాజుని నాగిరెడ్డి సతీష్ రావు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు అయ్యాజీ వేమా, అనకాపల్లి జిల్లా బీజేపీ ఇంచార్జి కర్రి చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబులతో పాటు బీజేపీ వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎపి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆవిర్భావ వేడుకలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య 43వ ఆవిర్భావ వేడుకలు ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. నగరంలో రాజమండ్రి పుల్లేవు సూర్య వెంకటరావు ఇంటి వద్దనున్న సంఘ కార్యాలయంలో తొలిత జండా వందనం చేశారు.అనంతరం 1980 నుండి ఇప్పటివరకు సమాఖ్యకు వివిధ రంగాలలో పనిచేసిన ప్రస్తుత అధ్యక్షులు, కార్యదర్శులు సహా వారి పేర్లను, ఎవరెవరు ఏ సంవత్సరంలో అనే విషయాలను రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల్ రావు వివరించారు.ఈ కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు పుల్లేవు సూర్య వెంకటరావు,రాష్ట్ర పురోహిత విభాగం ఉపాధ్యక్షులు భాగవతి నారాయణ శాస్త్రి (బాబీ), వాడ్రేవు వేణుగోపాల్ రావు, సెక్రెటరీ భాగవతుల వెంకటరమణమూర్తి, మహిళా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సూర్య కుమారి, కొత్తపల్లి భాస్కర రామం, ప్రయాగ సుబ్రహ్మణ్యం,నామవరం శ్రీ జోష్యుల దుర్గాప్రసాద్, వై. వి. జగన్నాధం (కాకినాడ),నరసింహమూర్తి, ప్రెస్ కన్వీనర్ రాజనాల సత్యనారాయణ,నరసింహ మూర్తి,ప్రభృతులు హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన సభ్యులకు సంఘ కార్యదర్శి భాగవతుల వెంకట రమణ మూర్తి ధన్యవాదాలు తెలిపారు.

## దూలం వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు

**రమాదేవి హాస్పిటల్ సౌజన్యంతో వైద్య పరీక్షలు మందులు పంపిణి**



**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం కేశవరం గ్రామం శ్రీ ఆనంద్ విద్యాలయ్‌లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనపర్తి రమాదేవి హాస్పిటల్ సౌజన్యం తో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రమాదేవి హాస్పిటల్ నుండి వచ్చిన డాక్టర్స్ ఉచితంగా సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసి సభ్యులు అన్నందేవుల కృష్ణ, వైసీపీ నాయకులు అద్దంకి రమణ, తుపాకుల ప్రసన్న కుమార్, కూసు దొరజీ, అబ్బిరెడ్డి వీర్రాజు, రాయపాటి సత్యనారాయణ, యడ్ల రవి, విన్నకోట ప్రసాద్, ముక్కపాటి రాజు రమాదేవి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి అండగా మంత్రి వాసంశెట్టి

**రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేత**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం కుయ్యేరు గ్రామం చింతలంకకు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త పెంకే నాగేశ్వరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషాద ఘటనపై స్పందించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చిన మంత్రి సుభాష్ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను పార్టీ ఎప్పటికీ మరచిపోదని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం, పార్టీ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాగేశ్వరావు మరణానంతర కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక సహాయంగా రూ.30 వేల చెక్కును ఆయన కుమారుడు పెంకే సూర్య చంద్రశేఖర్‌కు మంత్రి వాసంశెట్టి సుభాష్ అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మంత్రి అందించిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలతో పాటు పార్టీ కార్యకర్తల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. కార్యకర్తల కుటుంబాలకు అవసరమైన సమయంలో అండగా నిలబడటం పార్టీ సంస్కృతికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### బొంబాయి తెలుగు మహాసభల్లో

# జనరంజని బుర్రకథ బృందానికి అరుదైన గౌరవం




**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** బొంబాయిలో జూన్ 7, 8 తేదీలలో జరుగుతున్న తెలుగు మహాసభలు మరియు శ్రీ శ్రీ బాలాజీ మందిర్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలలో ద్రాక్షారామానికి చెందిన 'జనరంజని బుర్రకథ బృందం' అరుదైన ఘనత సాధించింది. నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ వేడుకల్లో ప్రముఖ బుర్రకథ కళాకారులు వేమవరపు రాంబాబు బృందం 'వీరాభిమన్యు' బుర్రకథను అత్యంత అద్భుతంగా ప్రదర్శించింది. ద్రాక్షారామ నాటక కళా పరిషత్ కోశాధికారి కూడా అయిన వేమవరపు రాంబాబు కథకుడిగా బి.ఆర్. కామేశ్వరరావు రాజకీయ విశ్లేషకుడిగా బి.కుమారస్వామి హాస్య కళాకారుడిగా తమ ప్రదర్శనతో అక్కడి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ అద్భుత ప్రదర్శనకు గానూ జనరంజని బుర్రకథ బృందాన్ని నిర్వాహకులు వేదికపై ఘనంగా సత్కరించారు. తమ ప్రాంత కళాకారులకు జాతీయ స్థాయిలో దక్కిన ఈ అరుదైన గౌరవం పట్ల ద్రాక్షారామ నాటక కళాపరిషత్ తీవ్ర హర్షం వ్యక్తం చేసింది. పరిషత్ అధ్యక్షులు నాగిరెడ్డి సతీష్ రావు, ప్రధాన కార్యదర్శి మరియు సినీ, రంగస్థల నటి వై. సరోజ, గౌరవ అధ్యక్షులు డాక్టర్ చెలికాని స్టాలిన్, ఇతర పరిషత్ సభ్యులతో పాటు ద్రాక్షారామ పరిసర ప్రాంత కళాకారులు వేమవరపు రాంబాబుకు మరియు ఆయన బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

### నౌ సైనిక్ క్యాంప్ పోటీల్లో సత్తా చాటిన

# రామచంద్రపురం వి.ఎస్.ఎం.కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నంలోని ఏఎన్ఐటీఎస్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ - నౌ సైనిక్ క్యాంప్‌లో రామచంద్రపురం వి.ఎస్.ఎం. కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. కాకినాడ గ్రూప్ 6 నావల్ యూనిట్ ఎన్‌సీసీ వింగ్‌కు చెందిన 9 మంది కేడెట్లు ఈ పోటీల్లో పాల్గొనగా వారిలో నలుగురు కేడెట్లు అత్యుత్తమ ప్రదర్శనతో పతకాలను సాధించి కళాశాలకు ఘనకార్తిని తీసుకువచ్చారు. ఈ పోటీలలోని షిప్ మోడలింగ్ విభాగంలో వి.ఎస్.ఎం. కళాశాలకు చెందిన కేడెట్లు పి. ప్రసన్న కుమార్, డి.పి.ఏ.వి. సురేఖ, మరియు జి. గంగాధర్ వర్మ అద్భుతమైన ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. వీరికి విశాఖపట్నం గ్రూప్ కమాండర్ కమోడోర్ సుమంత్ రాయ్ గారు స్వయంగా స్వర్ణ పతకాలను ప్రదానం చేశారు. అదేవిధంగా హెల్త్ అండ్ హైజీన్ విభాగంలో జరిగిన పోటీలలో కేడెట్ కె.వి.పి. సంతోష్ తన ప్రతిభను కనబరిచి రజత పతకాన్ని సాధించగా కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ చేతుల మీదుగా ఆ పతకాన్ని అందుకున్నారు. వీటితో పాటు ఇదే క్యాంప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాలకు చెందిన మరో ఇద్దరు కేడెట్లు తదుపరి స్థాయి ప్రతిష్టాత్మకమైన నౌ సైనిక్ ట్రైనింగ్ క్యాంప్‌కు ఎంపికయ్యారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించడంతో పాటు ట్రైనింగ్ క్యాంప్‌కు ఎంపికై కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన ఎన్‌సీసీ కేడెట్లను వి.ఎస్.ఎం. కళాశాల వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎం.ఎస్.యన్. మూర్తి మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ అలీ అన్సారీలు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులోనూ ఇలాగే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## కోనసీమ శాలివాహన సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మాచవరం గ్రామంలోని సంఘ భవనంలో కోనసీమ శాలివాహన సంక్షేమ సంఘం సమావేశం, సంఘ మాజీ అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో సంఘ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ సభ్యులు అధ్యక్షులు: పుల్లేటికుర్తి రత్నం , వర్కింగ్ ప్రెసిడెంట్: ర్యాలీ శ్రీనివాస్ వాడయర్, ప్రధాన కార్యదర్శి: ఆదుర్తి నారాయణమూర్తి , గౌరవ అధ్యక్షులు త్రిమూర్తులు, సంఘ సలహాదారు దొడ్డిపట్ల శ్రీనివాస్ , ట్రెజరర్ సఖినేటిపల్లి పెద్దిరాజు, ఉపాధ్యక్షులు: అంబటి వెంకట సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శి: తాడినాటి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పి.గన్నవరం - తాడినాటి రామకృష్ణ , అమలాపురం - ఏడిది రమేష్, రాజోలు పుల్లేటికుర్తి శివాజీ, కొత్తపేట - దేవగుప్తాపు నాగేంద్ర ,ముమ్మిడివరం - దొడ్డిపట్ల శ్రీరామచంద్రమూర్తి , నూతన కమిటీ ఎన్నిక నియమకమయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు సమావేశంలో పాల్గొన్న శాలివాహన సోదరులు అభినందనలు తెలియజేసి, సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## కెనాల్ బ్రిడ్జిల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కెనాల్ బ్రిడ్జిల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొత్తపేట-వాడపాలెం ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న రెండు కెనాల్ బ్రిడ్జిల పనులను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డుపై కొనసాగుతున్న బ్రిడ్జిల పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాగా, ఇదే రహదారిపై రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన సోలార్ వీధి దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.





# చిన్నారుల అభివృద్ధికి 'నవచేతన'కు శ్రీకారం...!

- ఏఐ ఆధారిత స్క్రీనింగ్ నిర్వహణపై శిక్షణ
- స్క్రీనింగులో గుర్తించిన పిల్లలను వైద్య సేవలు
- రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాచరణ
- రాష్ట్ర వ్యాప్తంగా ఈసీడీ కార్యక్రమం అమలు
- 8న రౌతులపూడి జెడ్పీ హైస్కూల్లో శిక్షణ
- 9న శంఖవరం జెడ్పీ హైస్కూల్లో శిక్షణ
- వెల్లడించిన శంఖవరం సిడిపిఒ పద్మావతి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి చిన్నారి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నవీన పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. 'నవచేతన' పేరుతో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత బాల్య ఆరంభ అభివృద్ధి (ఎర్లీ చైల్డ్ హుడ్ డెవల్ప్మెంట్ – ఈసీడీ) స్క్రీనింగ్ శిక్షణా కార్యక్రమానికి నడుం బిగించింది. గర్భ ధారణ నుంచి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1,000 రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైన కాలం. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుంది. ప్రతి సెకనుకు దాదాపు 10,000,00 న్యూరల్ కనెక్షన్లు ఏర్పడతాయి. పిల్లల మెదడు అభివృద్ధిలో 80 శాతం మూడేళ్ల లోపు, 90 శాతం ఆరేళ్ల లోపు పూర్తి అవుతుంది. ఈ ప్రారంభ సంవత్సరాల్లో పిల్లలకు అందే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, స్పందనాత్మక సంరక్షణ, ప్రారంభ అభ్యసన అవకాశాలు, భద్రత, పిల్లల భవిష్యత్తు, విద్య, ఆరోగ్యం, ఉత్పాదకత, శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. ఈ దశలో సరైన పోషణ, ఆరోగ్య సంరక్షణ, అభ్యసన అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం ప్రభుత్వ ప్రణాళిక. బాలల అభివృద్ధిలో ఆలస్యాలను కారణాలను ముందుగానే గుర్తించి సకాలంలో జోక్యం చేసుకునేందుకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో 'నవచేతన' అనే మొబైల్ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ సాధనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నాయి. పిల్లలలో "4డి"లైన పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, లోపాలు, అభివృద్ధిలో వైకల్యాలతో సహా జాప్యాలను ముందస్తుగా గుర్తించి తగిన సేవలకు అనుసంధానం చేయడం నవ చేతన కార్యక్రమం ముఖ్య లక్ష్యం. అలాగే నవ చేతన అనువర్తనం ద్వారా పిల్లల స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషాభివృద్ధి, జ్ఞానాత్మక అభివృద్ధి, సామాజిక, భావోద్వేగ అభివృద్ధి వంటి అంశాలను అంచనా వేస్తారు. ఈ నవచేతన అంతర్జాల అనువర్తనం ద్వారా పిల్లల అభివృద్ధిని శాస్త్రీయ పద్ధతిలో అంచనా వేసి, అభివృద్ధి ఆలస్యాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తారు. ఈ నవ చేతన కార్యక్రమం కేవలం స్క్రీనింగ్ సాధనం మాత్రమే. ఇది నిర్ధారణ కాదు. తుది నిర్ధారణను వైద్య నిపుణులు నిర్వహిస్తారు. స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన పిల్లలను అవసరమైన సందర్భాల్లో వైద్య సేవలు, జిల్లా ప్రారంభ జోక్య కేంద్రం (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ – డి.ఇ.ఐ.సీ) సేవలకు అనుసంధానం చేస్తారు. అంగన్వాడీ కేంద్రాలను బాలల సమగ్రాభివృద్ధి కేంద్రాలుగా మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలకపాత్ర పోషిస్తుందని ఒక భావన. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణను మే 29 న, 30 తేదీల్లో నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసారు. ఫలితంగా అవసరమైన విధి విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్టుల వారీగా అంగన్వాడీ కార్యకర్తలకు జూన్ 5 నుంచి 10 వరకు భారీ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రౌతులపూడి మండలం అంగన్వాడీ సిబ్బందికి 8 న రౌతులపూడి జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలోనూ, అలాగే శంఖవరం మండలంలోని అంగన్వాడీ సిబ్బందికి 9 న శంఖవరంలోని జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలోనూ స్క్రీనింగ్ నిర్వహణపై శిక్షణను ఇవ్వనున్నట్లు శంఖవరం ఐసిడిఎస్. ప్రాజెక్టు సిడిపీఒ. పర్వత వెంకటలక్ష్మి ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు మండలాల్లోని అన్ని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు సమయానికి హాజరై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సిడిపీఒ. పర్వత వెంకటలక్ష్మి ఆ ప్రకటనలో కోరారు.

# బూత్ స్థాయి నుంచే పార్టీని పటిష్టం చేయాలి : ఎమ్మెల్యే చినరాజప్ప

**– పార్టీ బలోపేతానికి శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయి : నిమ్మకాయల రంగనాథ్**
**– ప్రతి కుటుంబం మ్యాపింగ్ అయ్యేలా చూడాలి : కుడుపూడి సత్తిబాబు**




**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెద్దాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ హోంమంత్రి, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వర్క్షాప్పై నియోజకవర్గ స్థాయి శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజుతో కలిసి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఓటరు జాబితాల పారదర్శకత, ఖచ్చితత్వాన్ని మరింత మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఫ్యామిలీ జాబితాలో మ్యాపింగ్ అయ్యేలా పార్టీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అదేవిధంగా, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు లేదా అనర్హులైన వ్యక్తుల పేర్లను గుర్తించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించడం, కొత్తగా అర్హత పొందిన యువత వివరాలు సేకరించి ఓటరు నమోదు పక్రియ పై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ కార్యకర్తల పాత్ర కీలకమని, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగతంగా మరింత బలోపేతం కావడానికి ఇలాంటి శిక్షణా



కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్చార్జ్లు, బూత్ యూనిట్ ఇన్చార్జ్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పవన్ రాజీనామా చేసి నిజానిజాలు తేల్చుకోవాలి

**కోడి చెరువు కబ్జా! నిజమా! కాదా నిరూపించుకోవాలి – రాజకీయ అజెండా లేని పవన్ కళ్యాణ్**
**తెలంగాణా ఆవిర్భవ దినం నాడు వెళ్లి అరుపులు కేకలు వేయటం అవసరమా పవన్ – ప్రాంతీయ ఉన్మాద ఉద్యమనికి పవన్, కేసీఆర్ కుట్రా...?**
**ఆంధ్రరాష్ట్ర, తెలంగాణా ప్రజలు అప్రమత్తంగా వుండాలి : మేడా శ్రీనివాస్ తీవ్ర విమర్శలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోడి చెరువు కబ్జా ను దారి మళ్ళించటం – బిజెపి కి రాజకీయ మేలు చేయటానికే తెలంగాణా ఆవిర్భవ దినోత్సవాన్ని పవన్ కళ్యాణ్ అవకాశంగా మార్చు కున్నారని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తీవ్ర ఆరోపణ చేసారు. ఈ సందర్భంగా మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణా శంకర్ పల్లి – మోకిళ్ల రోడ్డుకు ఆనుకుని జన్వాడ లో కోడి చెరువును కబ్జా చేసారనే ఒక బలమైన ఆరోపణకు సమాధానం చెప్పాలంటే ముందుగా పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి తన నిజాయితీని నిరూపించుకోవాలి . కబ్జా నిజమా ! కాదా ! అనే అంశం పై తెలంగాణా సర్కార్ న్యాయ విచారణ జరిపించాలి . ప్రభుత్వ చెరువు పవన్ కళ్యాణ్ ఆక్రమించుకున్నారని ఇంత పెద్ద ఎత్తున భూ వివాదం మీడియాలో పుంకాను పుంకాలుగా నిత్యం చర్చలు జరుగుతున్నా రేవంత్ రెడ్డి సర్కార్ నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరించటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి . తెలంగాణాలో కోడి చెరువు భూ కబ్జా భయట పడిన అనంతరం భవిష్యత్ లో ఆంధ్రప్రదేశ్ లో కూడా రాజకీయ సమీకరణలు తారుమారు అయితే పవన్ కళ్యాణ్ పై మరిన్ని భూ నేర ఆరోపణలు భయట పడతాయని కూటమి సర్కార్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి . పవన్ కళ్యాణ్ రాజకీయ అరుపులు ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణా కు బదిలి కావటంలో చాలా బలమైన రాజకీయ కుట్ర దాగి వుందనే సందేహాలు బలంగా వ్యక్త మవుతున్నాయి. కోడి చెరువు కబ్జా నిజామా ! కాదా..! అనేది చట్ట బద్దంగా నిరూపించుకోవాల్సిన బాధ్యత పవన్ కళ్యాణ్ దన్నారు.లోతుగా తెలంగాణా సర్కార్ దృష్టి సారిస్తే పవన్ కళ్యాణ్ పై క్రిమినల్ కేసులు నమోదు కాభడే పరిస్థితులు ఉత్పన్న మవుతాయని రాజకీయ మేధావులలో చర్చలు వినిపిస్తున్నాయి . కొన్నాళు ్ళ తరువాత ఈ భూ వివాదం ప్రజలు మరిచి పోతారు. విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ పై కనీసం ధ్యాస పెట్టని పవన్ కళ్యాణ్ ప్రశాంతంగా వున్న తెలంగాణా వెళ్లి జూన్ 2 ఆవిర్భవ దినం పేరిట అరుపులు కేకలు తో రచ్చ రచ్చ చేసి ప్రాంతీయ విద్వేషాలను రెచ్చకోట్టటంలో పవన్ కళ్యాణ్ రాజకీయ కుట్ర దాగివుంది.ప్రాంతీయ విద్వేషాలకు అగ్గి రాజేసి మరో రాజకీయ పార్టికి పవన్ కళ్యాణ్ మేలు చేసే విధంగా అవసరం లేని వివాదస్పంద ఉపన్యాసాలతో శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తున్నారు . ఆంధ్రరాష్ట్రం లో పవన్ రాజకీయ ఉపన్యాస అరుపులు ప్రస్తుతం తెలంగాణా వరకు చేర్చటంలో అర్థం ఏమిటి ! పవన్ కళ్యాణ్ రాజకీయ లక్ష్యం రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగ పడక పోగా రాష్ట్ర భవిష్యత్ ను నిర్వీర్యం చేస్తున్నాయి . హైదరాబాద్ లో పవన్ కళ్యాణ్ ఉనికి చాటుకునే ప్రయత్నం వెనుక ఒక పెద్ద సంపన్న రాజకీయ పార్టి వ్యూహం దాగె వుందనటంలో సందేహమే లేదు. ప్రొఫెసర్ నాగేశ్వరావు ఆరోపణలకు సమాధానం చెప్పలేకనే పోలీస్ కేసులు అంటు ఒక హై డ్రామా కట్టించారని , కోడి చెరువు కబ్జా ను దృష్టి మళ్ళించటానికి కొన్ని సొంత మీడియాల్లో సొంత కథనాలు వ్రాయించుకుంటున్నారని, తెలంగాణా ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ వేదికగా పవన్ కళ్యాణ్ ఉపన్యాస అరుపులు గమనిస్తుంటే తెలంగాణా – ఆంధ్రప్రదేశ్ లో మరో ప్రాంతీయ అరాచకానికి కేసీఆర్ , కేటీఆర్ లతో కుట్ర చేస్తున్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయాన్నారు. కేసీఆర్ కుమార్తె కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశిస్తు మూతి పళ్ళు రాలగోడతాం అని రెచ్చ గొట్టే మాటలు మాట్లాడుతుంటే, కేటీఆర్ పవన్ కళ్యాణ్ వస్తే బిరియాని పెట్టి పంపిస్తాం అని కమలహాన్ ను మించిన నటనతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా, విభజన హామీలు కోసం కేంద్రం వద్ద బాచిమఠం వేసిన పవన్ కళ్యాణ్ విలువలు కోసం మాట్లాడటం బాధాకరంగా వుందని ఆయన ఏద్దేవా చేసారు. కోడి చెరువు కబ్జా కేసీఆర్ సర్కార్ సమయంలోనే జరిగిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు కేసీఆర్ – పవన్ కళ్యాణ్ ల పట్ల అప్రమత్తంగా వుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రజల ఐఖ్యతతో కేంద్రం నుండి మన తెలుగు రాష్ట్రాల అభివృద్ధిని సాధించుకోవాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు.వారంతపు సమావేశంలో అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి , దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , దుడ్డే త్రినాద్ , గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా , గెద్దాడ సుందరి , నాగూరి అన్నపూర్ణ , అడపా శేషగిరి , సింహాద్రి తిలక్ అమృత్ , నున్నా గణేష్, బంకపల్లి సత్తిబాబు, ఆకాశం కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణ అందరి బాధ్యత : అన్నవరం ఎస్ఐ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అడవుల్ని సంరక్షించడం మన పౌరుల అందరి బాధ్యతని అన్నవరం పోలీసు స్టేషన్ ఎస్ఐ శ్రీహరిబాబు పేర్కొన్నారు. పకృతి ఎప్పుడూ పచ్చదనంతోనే నిండి ఉంటుందని, విత్తన బంతుల తయారీతో గ్రీన్ బెల్టును పెంచడం సులభ సాధ్యమని ఆయన వివరించారు. కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు ఆదేశాల మేరకు ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దుర్గా రాంప్రసాద్ పర్యవేక్షణలో అన్నవరంలోని మిస్సమ్మ కొండ అటవీశాఖ క్యాంపు కార్యాలయం ప్రాంగణంలో శంఖవరం మండలం అన్నవరం, మండపం, రౌతులపూడి మండలం పారుపాక గ్రామాల ప్రజలకు విత్తన బంతుల తయారీపై ఆదివారం అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్.ఐ. శ్రీహరిబాబు మాట్లాడారు. అడవుల్ని సంరక్షించడం అందరి బాధ్యత అంటూ అటవీశాఖ సిబ్బంది నేతృత్వంలో చేపడుతున్న విత్తన బంతుల తయారీని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శంఖవరం అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ గంటిమళ్ళ నాగేశ్వరరావు, అటవీ బీటు ఆఫీసర్లు పూసం లావణ్య, పి.వి. రమణ, బేస్ క్యాంప్ హెల్పర్ ఏడిద శేఖర్, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్టీ కమిషన్ చైర్మన్ దృష్టికి ఉప ప్రణాళిక గిరిజనుల సమస్యలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల పరిధిలోని గిరిజనులు తమ పూర్తి హక్కులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను మరింత సమర్థవంతంగా పొందేందుకు ప్రత్యేక పరిపాలనా వ్యవస్థ అవసరమనే డిమాండ్ను ఎన్నో సంవత్సరాలుగా వ్యక్తం చేస్తూవస్తున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన గ్రామాలను సమీకరించి మినీ ఐటిడిఏ ఏర్పాటుతో పాటు కొత్త గిరిజన మండలం ఏర్పాటు చేయాలనే వారి చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా పూర్వ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్ పూనుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోల్ల బొజ్జిరెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. రంపచోడవరంలోని చైర్మన్ కార్యాలయంలో ఆదివారం కురిసిన చిలుకూరి గిరిజనుల పలు సమస్యలకు పరిష్కారాన్ని కోరుతూ బొజ్జిరెడ్డితో విస్తృతంగా చర్చించారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ గిరిజనుల న్యాయమైన కోరికలను పరిశీలించి, త్వరలోనే వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజనుల అన్ని సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

# కూలీలతో మమేకమైన రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు మత్సేటి




**ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ వితరణ**

**బొమ్మూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామ పంచాయతీ ఏరియా పాత బొమ్మూరు గ్రామం తాళ్ల చెరువులో గత కొన్ని రోజులుగా శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశానుసారం జరుగుతున్న పనులను ఆదివారం ఉదయం రాజమహేంద్రవరం రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు మత్సేటి శివ సత్యప్రసాద్ పరిశీలించారు. పని చేస్తున్న కూలీలకు ఆయన స్వయంగా మజ్జిగ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ కో ఇంచార్జ్ పేట వీరలక్ష్మి, గ్రామ టిడిపి ప్రధాన కార్యదర్శి సాంబారి సతీష్, జగిలింగి దుర్గా,ఓం ప్రకాష్,సూపర్ వైజర్ వెంకట లక్ష్మి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# పాఠశాలకు కీర్తి తెచ్చిన ఐశ్వర్య



**ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలో మెరిసిన ఐశ్వర్య**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక క్వారీపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న తిరగాటి ఐశ్వర్య ప్రపంచ తెలుగు సాహిత్య మహా సభలో తన ప్రతిభతో అందరి మన్ననలు పొందింది. ఈ రోజు శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన 7వ తెలుగు సాహిత్య మహాసభల్లో రాణి రుద్రమదేవి ఏక పాత్రాభినయం ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకుంది. శ్రీ శ్రీ కళా విదిక సీఈవో కె. ప్రతాప్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంది. గైడ్ టీచర్ ఎం ఎన్ వి లక్ష్మి, ఐశ్వర్యను నిర్వాహకులు వేదికపై సత్కరించారు. తమ పాఠశాలకు కీర్తి తెచ్చిన ఐశ్వర్య ను ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వి రమణ , ఉపాధ్యాయులు అంబేత్కర్ , వరప్రసాద్ మరియు శివకుమారి అభినందనలు తెలియచేశారు.

# నేరస్థుడిపై పీడీ చట్టం అమలు

**నేరాల నియంత్రణకు పోలీసుల పీడీ అస్త్రం**
**ప్రజా భద్రతకు ముప్పుగా మారిన వ్యక్తి నిర్బంధం**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆస్తి నేరాలకు పాల్పడుతూ ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్న అలవాటు నేరస్థుడు కోసూరి వెంకట రమణపై పోలీసులు ప్రివెంటివ్ డిటెన్షన్ (పీ.డీ) చట్టాన్ని అమలు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, రాజమహేంద్రవరం టి.వి.రోడ్, సారంగధర మెట్టకు చెందిన కోసూరి వెంకట రమణ (57)పై మొత్తం 42 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అతను తరచూ ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడుతూ ప్రజా భద్రతకు ముప్పుగా మారడంతో, భవిష్యత్తులో మరిన్ని నేరాలు జరగకుండా నిరోధించే చర్యగా పీడీ చట్టం కింద నిర్బంధించారు. తూర్పు గోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు రౌడీ ఎలిమెంట్లు, అలవాటు నేరస్థులు మరియు ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం నేర కార్యకలాపాల్లో నిరంతరం పాల్గొనే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైతే పీడీ చట్టం కూడా అమలు చేస్తామని పోలీసులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# కనుమరుగై పోతున్న పద్యాలకు జీవం పోస్తున్న ముంగండి : ఎమ్మెల్యే వాసు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న తరానికి తెలుగు బాష పట్ల మక్కువ పెంచేందుకు తెలుగుపద్యాలు ఎంతో ఉపయుక్తం అని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తెలుగు బాష విస్తృతికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ముంగండి సూర్యనారాయణ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. పౌర గ్రంథాలయ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఏప్రిల్ 28నుండి జూన్ 6 వరకు,స్థానిక దానవాయిపేట మహిళా శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ చంద్ర పద్మ దేవి ఆధ్వర్యంలో నిర్వహించబడిన 40 రోజుల వేసవి విజ్ఞాన శిబిరమునందు ముంగండి సూర్యనారాయణ తెలుగు పద్యాలు, కథలు,యోగ అంశాల్లో విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ ముంగండి ఇవ్వడం అభినందనీయం అన్నారు. వీరి స్వచ్ఛంద సేవలు ఎందరికో స్ఫూర్తి నిస్తాయన్నారు. స్థానిక పెద్దల సమక్షం లో, గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభలో ముంగండి సూర్యనారాయణ ను ఎమ్మెల్యే వాసు ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు.

## హైస్కూల్ ప్రాంగణంలోని

# కూలిన వృక్షం... ఎవరి సొత్తు?

◆ ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్న వైనం ◆ పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాయవరం ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో ఇటీవల కూలిపోయిన భారీ వృక్షం ఇప్పుడు వివాదానికి దారితీస్తోంది. ప్రభుత్వ పాఠశాల పరిధిలో ఉన్న వృక్షం ప్రభుత్వ ఆస్తిగా పరిగణించాల్సి ఉండగా, దానిని ఎలాంటి అధికారిక ప్రక్రియ లేకుండా బయట వ్యక్తులు యంత్రాలతో ముక్కలుగా నరికి తీసుకెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెట్టు తొలగింపుపై పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ లేదా గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడం మరిన్ని సందేహాలకు కారణమవుతోంది. సాధారణంగా ఇటువంటి చెట్లు కూలినప్పుడు పంచనామా నిర్వహించి, విలువ అంచనా వేసి, అధికారిక వేలం ద్వారా విక్రయించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ అలాంటి విధానాలు పాటించారా? లేక ప్రభుత్వ ఆస్తి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయం ప్ స్థానికులు మాట్లాడుతూ, "పాఠశాల ఆవరణలోని చెట్టు అయితే అది ప్రజల ఆస్తి. మరి ఎవరి అనుమతితో తీసుకెళ్తున్నారు?" అని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి స్పందించి పూర్తి వివరాలు వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# క్వారీ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కీలక నిర్ణయం

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం - పబ్లిక్ హెల్త్ అధికారులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమీక్ష



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్వారీ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అమృత్ 2.0 పథకం కింద సుమారు రూ.95 కోట్ల వ్యయంతో సమగ్ర తాగునీటి ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో నిర్వహించిన విస్తృత సమీక్ష సమావేశంలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రాజెక్టు నమూనాను ఎమ్మెల్యేకు వివరించి, అమలు కార్యాచరణపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆధునిక సదుపాయాలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, రోజుకు 20 ఎంఎల్డీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు, లా హాస్పిన్ సమీపంలో శాశ్వత రా వాటర్ పికప్ పాయింట్ నిర్మాణం, సమగ్ర పైప్‌లైన్ వ్యవస్థ అభివృద్ధి వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే క్వారీ ప్రాంత ప్రజలకు నిరంతర, నాణ్యమైన తాగునీటి సరఫరా అందుబాటులోకి వచ్చి దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నగరంలోని ప్రతి ప్రాంతానికి సమాన అభివృద్ధి అందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో నగర ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న ముంపు సమస్యల పరిష్కారంపైనా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. తిలక్ రోడ్, హైటెక్ బస్‌స్టాండ్, నల్లా చానల్ పరిసర ప్రాంతాలు, అంబేద్కర్ నగర్, అశోక్ కళ్యాణ మండపం ప్రాంతాలు, వై-జంక్షన్ వంటి లోతట్టు ప్రాంతాల్లో తరచూ ఏర్పడుతున్న నీటిముంపును శాశ్వతంగా నివారించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. హైటెక్ బస్‌స్టాండ్ నుంచి నల్లా చానల్ వరకు రహదారుల ఎత్తు పెంపు, డ్రైనేజీ కాలువల విస్తరణ, నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్న ప్రాంతాల గుర్తింపు వంటి అంశాలపై సాంకేతిక అధ్యయనం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఈ పనుల అంచనా వ్యయం సుమారు రూ.25 కోట్లుగా ఉండొచ్చని అధికారులు వివరించగా, దీర్ఘకాలిక ప్రయోజనం దృష్ట్యా అవసరమైతే మరింత సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. త్వరలోనే ఉన్నతాధికారులు, సాంకేతిక నిపుణులతో మరో సమీక్ష సమావేశం నిర్వహించి తుది నిర్ణయాలు తీసుకుని పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. నగర అభివృద్ధి, ప్రజల సౌకర్యాలే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు.

# సామాన్యులకు అందుబాటులో ఆధునిక వైద్యం

డాక్టర్ గూడూరి శ్రీనివాస్ - గుండె-ఊపిరితిత్తుల వ్యాధులపై వైద్యులకు అవగాహన సదస్సు
విజయభారతి చెస్ట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో హార్ట్ అండ్ లంగ్స్ సీఎంఈ విజయవంతం





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాన్యులకు ఆధునిక వైద్యం అందుబాటులో ఉంచాలని లక్ష్యంతో 25 సంవత్సరాల క్రితం విజయ భారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేసినట్లు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జేఎన్ రోడ్ లోని ఐఎంఏ హాల్ లో విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్, పల్స్ హాస్పిటల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాజమహేంద్రవరం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హార్ట్ అండ్ లంగ్స్ వ్యాధులపై ఉభయగోదావరి జిల్లాల డాక్టర్ల కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిఎస్ఎల్ మెడికల్ కాలేజీ అధినేత డాక్టర్ గన్నీ భాస్కర్ రావు, బొల్లినేని హాస్పటల్ ఎండి డాక్టర్ రామరాజు, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ పిడుగు విజయభాస్కర్ పాల్గొన్నారు. గుండె, ఊపిరితిత్తుల వైద్య రంగంలో తాజా పరిణామాలు, ఆధునిక చికిత్సా విధానాలు, హృదయ, శ్వాసకోశ వ్యాధుల నిర్వహణలో నూతన అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ అవగాహన కార్యక్రమానికి విజయభారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ అధినేత, ప్రఖ్యాత పల్మనాలజిస్ట్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆర్గనైజర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు నిరంతరం తమ జ్ఞానాన్ని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడం ద్వారా రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించగలరని పేర్కొన్నారు. హృదయ మరియు ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులపై డాక్టర్ల కు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గుండె ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులపై నిర్వహించిన సదస్సుకు ఉపయోగ గోదావరి జిల్లాల నుంచి సుమారు 200 మంది డాక్టర్లు అవగాహన సదస్సులో పాల్గొన్నట్లు తెలిపారు. ఇటువంటి సదస్సులు నిర్వహించడం వలన డాక్టర్లకు ఆధునికమైన టెక్నాలజీ వినియోగం, వృత్తి నైపుణ్యత పెరుగుతుందని అన్నారు. జీ.ఎస్.ఎల్ మెడికల్ కాలేజీ అధినేత డాక్టర్ గన్ని భాస్కర రావు మాట్లాడుతూ మనిషి మెదడు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ వంటి అవయవాలు సక్రమంగా ఉంటే సుఖవంతమైన జీవితం జీవించవచ్చునని అన్నారు. గత 20 సంవత్సరాలు క్రితం ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధుల చికిత్స కోసం హైదరాబాద్, ముంబై తదితర మెట్రో నగరాలకు వెళ్లే వారని అయితే ప్రస్తుతం రాజమండ్రిలోనే ఆధునిక టెక్నాలజీ తో వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. వైద్య రంగంలో సుమారు 25 సంవత్సరాల పైగా అనుభవం ఉన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్ గుండె, ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ రామరాజు మాట్లాడుతూ అవగాహన సదస్సులు వలన వృత్తి నైపుణ్యం పెరుగుతుందని అన్నారు. శ్వాసకోశ వ్యాధుల చికిత్సలో విశేష అనుభవం కలిగిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మణ్ డాక్టర్ వంశీకృష్ణరాజు, డాక్టర్ సాజిత్ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పల్స్ హాస్పిటల్ డాక్టర్ లక్ష్మణ్ కొల్లూరు మాట్లాడుతూ మెట్రో నగరాలలో కార్డియాలజీ విభాగానికి సంబంధించిన ఆధునిక పరికరాలు ప్రస్తుతం రాజమహేంద్రవరం లోని పల్స్ హాస్పిటల్‌లో అందిస్తున్నామని అన్నారు అడ్వాన్స్ టెక్నాలజీతో ఉభయగోదావరి జిల్లాలలో పల్సర్ హాస్పిటల్ కార్డియాలజీ పల్మనాలజీ వ్యాధులకు వైద్య సేవలు అందిస్తుంది అన్నారు. కార్డియాలజీ, పల్మనాలజీ రంగాలకు చెందిన ప్రముఖ నిపుణులు ఈ సిఎంఈ లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. వైద్య నిపుణులు డాక్టర్ అన్వేష్, డాక్టర్ లక్ష్మణ్ డాక్టర్ వంశీకృష్ణంరాజు డాక్టర్స్ సాజిత్ కిషన్ డాక్టర్ వంశీ ధర్ తదితరులు స్లీప్ డిజార్డర్స్, సెకండరీ హైపర్‌టెన్షన్, ఆస్తమా నిర్వహణ, ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, నాన్-రిజాల్వింగ్ న్యూమోనియా, హార్ట్ ఫెయిల్యూర్ మేనేజ్‌మెంట్, థొరాసిక్ సర్జరీ, ఆధునిక కార్డియాక్ సర్జరీ విధానాలు వంటి కీలక అంశాలపై ప్రత్యేక శాస్త్రీయ ప్రసంగాలు చేశారు. యువ వైద్యుల కోసం ఈసీజీ లు, చెస్ట్ ఎక్స్ రే ల ఆధారంగా ఇంటరాక్టివ్ పీజీ క్విజ్ కూడా నిర్వహించారు. ఈ సీఎంఈ కార్యక్రమానికి ఏపీఎంసీ ద్వారా 2 క్రెడిట్ అవర్స్ మంజూరు చేయబడినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య నిపుణులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మణ్ కొల్లూరు, డాక్టర్ వంశీకృష్ణరాజు, డాక్టర్ సాజిత్ కిషన్ అవగాహన సదస్సులో ప్రసంగించారు.

# వివి రెడ్డి పంతులు సత్రం అధ్యక్షులుగా మట్టా



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మిరియాల వెంకటరెడ్డి పంతులు సత్రం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం కోరుకొండ వివి రెడ్డి పంతులు సత్రం అధ్యక్షులుగా మట్టా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా పసుపులేటి శివ, వాతాడ గోపి కృష్ణ, తాటికొండ మృత్యుంజయరావు, చింతపెంట రామచంద్ర రావు, తగరంపూడి నాగవేణి, అదివరపు మంగాదేవి, ధనాలకోట లక్ష్మి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ మేడిశెట్టి శివరాం నూతన కమిటీని అభినందిస్తూ, భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జనసేన పార్టీకి మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు పూలమాలవేసి సాల్వో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మేడిశెట్టి శివరాం, బదిరెడ్డి దొర, నూతన కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా కర్రి జన్మదిన వేడుకలు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండల జడ్పిటిసి సభ్యులు కర్రి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను వైకాపాశ్రేణిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం కోరుకొండ వైకాపా కార్యాలయంలో జడ్పిటిసి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకుంటూ నాగేశ్వరరావుకు పలువురు వైకాపా నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు వైకాపా శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు అడపా కనకరాజు, గణేషుల పోసియ్య, కొండపల్లి దుర్గారావు, నీరుకొండ బాబ్జి, సూరిశెట్టి కుటుంబరావు, తోరాటి శ్రీను, సలాది వెంకటేశ్వరరావు, బోడపాటి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులుగా ఇల్లపు, నరేష్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ కోరుకొండ మండల ఓబీసీ అధ్యక్షులుగా ఇల్లపు శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బిజెపి జిల్లా మోర్చా అధ్యక్షులు నరేష్ కుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం కోరుకొండ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా మోర్చా అధ్యక్షులు నరేష్ కుమార్ యాదవ్, బిజెపి మండల అధ్యక్షులు అడపా సుధీర్ ఆధ్వర్యంలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు తెలిపారు. కోరుకొండ ఓబిసి మండల అధ్యక్షులుగా ఇల్లపు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సువర్ణపూడి వీర వెంకట సత్యనారాయణ,మరో ప్రధాన కార్యదర్శిగా తోకాడ అడవిరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కమిటీసభ్యులు భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాలెపు సత్య సాయిరాం, బిజెపి ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆచార్యులు, బిజెపి ఓబీసీ రాష్ట్రకార్యదర్శి మన్నెం శ్రీనివాస్,బిజెపి జిల్లా కార్యదర్శి మద్దిపాటి రజిని, బిజెపి ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు తనకాల శ్రీనివాస్ నాయుడు,బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు తగరంపూడి గణపతి,బిజెపి ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు పచ్చారి నరసింహమూర్తి, బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాతృశ్రీ తలుపులమ్మ జాతరకు కంబాల లక్ష రూపాయలు విరాళం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం నిడిగట్లలో మాతృశ్రీ తలుపులమ్మతల్లి జాతర మహోత్సవలకు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 నాయకులు కంబాల శ్రీనివాసరావు లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఆదివారం నిడిగట్లలో మాతృశ్రీ తలుపులమ్మ తల్లి జాతర ముగింపు సందర్భంగా నిర్వహించిన భారీ అన్న సమారాధనకు కంబాల లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. కంబాల శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, బత్తిన వీరాంజనేయులు, నాగ రమేష్, మళ్ల అదిశేషు, ధార శ్రీను, కాకర దుర్గారావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసమే లక్ష్యం

ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏ.వి. సుబ్బరాజు - జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఆదేశాల మేరకు, ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏ.వి. సుబ్బరాజు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎల్. చెంచి రెడ్డి ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఆదివారం ఉదయం"సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని సైక్లింగ్ నిర్వహించారు. అనంతరం వాలీబాల్ క్రీడా పోటీలను కూడా నిర్వహించగా, సిబ్బంది క్రీడా స్ఫూర్తితో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ.వి. సుబ్బరాజు మాట్లాడుతూ, పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, ఒత్తిడి నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఇటువంటి ఫిట్‌నెస్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు. విధి నిర్వహణలో మరింత సమర్థత, అప్రమత్తత, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి (ఏఆర్)టి.వి.ఆర్.కె. కుమార్, ఆర్.ఐ (ఏఆర్) పి. సంజీవ్ కుమార్, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థులకు అభినందన పురస్కారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ప్రతిభ సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు రాజమండ్రి అర్బన్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ద్వారా ప్రతిభా పురస్కారాలను అందజేసింది. సంఘ అధ్యక్షులు లక్కోజు వీరభద్రరావు (లక్కోజి), ప్రధాన కార్యదర్శి అములోజు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఆదివారం రోజున ఈ కార్యక్రమం శ్రీ గౌరీ విలాస్ విశ్వబ్రాహ్మణ సత్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయవాది, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ బ్రహ్మశ్రీ రామోజు కామాచారి, సంఘ గౌరవ అధ్యక్షులు, కిమ్స్ సిఈఓ డాక్టర్ నామగిరి రామరాజు, దుద్దుపూడి చినవరహాలు, అనుపోజు వెంకటరమణ మూర్తి, కోసూరి గోపాలరత్నం(గోపి), కాకినాడ వెంకటేశ్వరరావు, యర్రగొండ సూరిబాబు, చేబోలు లీలా హరినాథ శాస్త్రి, కానూరి వెంకటరావు, తాళాబత్తుల నాగ శివశంకర్, అంబవరపు గంగాధరం, కాగితపు శ్రీనివాసు, దుద్దుపూడి నాగ వెంకట ఆదినారాయణ, చెల్లూరి రత్నకుమార్,గోర్స వెంకటరమణ, మల్లెడ త్రినాధరావు, అండలూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొని వారి చేతులమీదుగా విద్యార్థిని విద్యార్థులకు అభినందనలతో నగదు, జ్ఞాపిక పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 600కు గాను 592 మార్కులు వచ్చిన పొన్నాడ సత్య శిరీష అనే విద్యార్థినీతో పాటు 16 మంది విద్యార్థులకు ఈ పురస్కారాలు అందజేసినట్లు లక్కోజు వీరభద్రరావు తెలిపారు.




# సినిమా ఇండస్ట్రీలో అతనే నా బెస్ట్ ఫ్రెండ్..

## మనసులో మాట చెప్పిన జ్యోతిక

సినీ పరిశ్రమలో అగ్రతారగా కొనసాగుతున్న జ్యోతిక, గతంలో ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలోని పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తల్లిగా, నటిగా, ఒక సాధారణ గృహిణిగా తన బాధ్యతలను ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారో ఈ ఇంటర్వ్యూలో వివరించారు. స్టార్ హీరోయిన్ జ్యోతిక గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. జ్యోతిక మాట్లాడుతూ.. తన పిల్లలు తన సినిమాలను చూసి గర్వంగా థియేటర్‌కు వెళ్లడం కంటే పెద్ద కాంప్లిమెంట్ ఏదీ లేదని స్పష్టం చేశారు. "నా పిల్లలు సిగ్గుపడేలా నేను ఎప్పుడూ చేయను. వాళ్ళు గర్వంగా తమ స్నేహితులతో వచ్చి నా సినిమా చూడాలి" అని ఆమె అన్నారు. ఈతరం పిల్లలకు అన్నీ ఉన్నా డిప్రెషన్ వంటి సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో, సినిమా ద్వారా సానుకూల సందేశాలు ఇవ్వడం ముఖ్యమని ఆమె అన్నారు. చంద్రముఖి సినిమా ఇంకా ఎన్ని తరాలు చూస్తారో తెలియదని, ఆ పాత్ర ప్రభావం గొప్పదని గుర్తు చేసుకున్నారు. తెలుగు సినీ పరిశ్రమ పట్ల జ్యోతిక ఎంతో కృతజ్ఞత భావాన్ని వ్యక్తం చేశారు. "తెలుగు పరిశ్రమ చాలా ఆప్యాయంగా, ప్రేమగా ఉంటుంది. తెలుగువాళ్లు అన్ని రకాల సినిమాలను ఆదరిస్తారు" అని ఆమె అన్నారు. తాను, సూర్య ఎక్కువగా డబ్బింగ్ సినిమాలే చేసినప్పటికీ, తెలుగు ప్రేక్షకులు తమను అంగీకరించి, ప్రేమించిన తీరు ఎంతో ప్రత్యేకమని జ్యోతిక పేర్కొన్నారు. చిరంజీవి ఠాగూర్, రవితేజ షాక్ వంటి చిత్రాలతో తెలుగులో నటించిన అనుభవాలను పంచుకున్నారు జ్యోతిక. సూర్యతో తన బంధం గురించి మాట్లాడుతూ, కులం, మతం వంటి వాటిని తాను నమ్మనని, సూర్య తన బెస్ట్ ఫ్రెండ్ అని తెలిపారు. భర్త బెస్ట్ ఫ్రెండ్‌గా ఉండటం కంటే గొప్ప విషయం ఏముంటుందని ఆమె అన్నారు. ఈతరం పిల్లల పెంపకంలో వచ్చిన మార్పుల గురించి మాట్లాడుతూ, ప్రస్తుత పిల్లలు మరింత ఫ్రీడమ్, అభిప్రాయాలు కలిగి ఉన్నారని, వారికి కొంత స్పేస్ ఇవ్వడం ముఖ్యమని సూచించారు. కోవిడ్ తర్వాత తల్లిదండ్రుల ఆరోగ్యం దృష్ట్యా, పిల్లల విద్య కోసం చెన్నై నుంచి ముంబైకి మారినట్లు వివరించారు. ఒకరినొకరు మెచ్చుకోవడం, స్పేస్ ఇవ్వడం, గౌరవించుకోవడం మంచి వైవాహిక బంధానికి కీలకమని జంటలకు సలహా ఇచ్చారు జ్యోతిక. అలాగే సినిమాల విషయానికొస్తే.. భాష కంటే కథ, పాత్రకే తాను ప్రాధాన్యత ఇస్తానని జ్యోతిక అన్నారు. మలయాళంలో మమ్ముట్టి గారితో ఒక సినిమా చేశానని, మంచి స్క్రిప్ట్ వస్తే ఏ భాషలోనైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. 2డి ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా మంచి కథలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో చిన్న కలగా ప్రారంభించి, నేషనల్ అవార్డు స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందని చెప్పారు. నార్త్, సౌత్ నటులు కలిసి రావడంతో సినిమా పరిశ్రమ మరింత గొప్పగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.



# అంత పెద్ద హీరో అయ్యుండి.. నాకు ఫోన్ చేసి సారీ చెప్పాడు..

## షాకింగ్ విషయం చెప్పిన మమతా మోహన్ దాస్



నటి మమతా మోహన్‌దాస్ ఓ స్టార్ హీరోతో కలిసి ఒక సినిమా సెట్‌లో తనకు ఎదురైన అనుభవాన్ని పంచుకున్నారు. ఒక సినిమా పాట షూటింగ్ కోసం స్టార్ హీరోతో కలిసి నటించడానికి తనను ఆహ్వానించారని ఆమె తెలిపారు. అప్పుడు ఊహించని సంఘటన జరిగిందని తెలిపింది మమతా.. నటి మమతా మోహన్‌దాస్ తన కెరీర్ తొలినాళ్లలో సూపర్ స్టార్ రజినీకాంత్‌తో కలిసి నటించే అవకాశం లభించినప్పుడు ఎదురైన ఒక సంఘటనను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు మమతా. 2007 సమయంలో, ఒక సినిమా పాట చిత్రీకరణ కోసం రజినీకాంత్ గారితో కలిసి డ్యాన్స్ చేయడానికి తనను పిలిచారని మమత వెల్లడించారు. అప్పుడు తను దుబాయ్‌లో వేరే సినిమా షూటింగ్‌లో ఉన్నప్పటికీ, రజినీకాంత్ గారి పట్ల ఉన్న అపారమైన గౌరవం కారణంగా ఆ షూటింగ్‌ను వదిలి ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడానికి వచ్చానని ఆమె తెలిపారు. ఈ పాటలో మమతా మోహన్‌దాస్ ఒక డైరెక్టర్‌గా, రజినీకాంత్‌తో కలిసి పాటలో ఆడుతున్నట్లు షూట్ చేశారట. ఇది ఒక సినిమా లోపల ఇంకో సినిమా షూటింగ్ జరిగితున్నట్టు ఉండే కాన్సెప్ట్‌తో కూడిన పాట. తాను లొకేషన్‌కు చేరుకున్న తర్వాత షూటింగ్ ఆలస్యమైందని, గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చిందని మమత పేర్కొన్నారు. రోజుల తరబడి షూటింగ్‌లో పాల్గొన్నప్పటికీ, చివరికి తన షాట్లు ఏవీ సినిమాలో లేవని ఆమెకు తెలిసిందట. సినిమాలో తాను కేవలం ఒక క్యాప్ అంచు మాత్రమే కనిపించే ఒక బ్యాక్ షాట్‌లో ఉన్నానని, తన ముఖం కూడా స్పష్టంగా కనిపించలేదని ఆమె అన్నారు. ఈ సంఘటన తనను తీవ్రంగా నిరాశపరిచిందని, నాలుగు రోజులు విలువైన సమయం వృథా అయ్యిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి పరిస్థితుల గురించి మాట్లాడుతూ, పాటలో తన భాగం ఎందుకు తీసేశారో తనకు తెలియదని, అయితే మెయిన్ హీరోయిన్ మరొక నటి వచ్చి డ్యాన్స్ చేయడాన్ని ఇష్టపడలేదని, అందుకే తన పాత్ర తీసేశారని తాను విన్నానని మమత తెలిపారు. ఇది వదంతులు మాత్రమే కావచ్చని, దీనిపై తనకు పూర్తి స్పష్టత లేదని ఆమె అన్నారు. ఆ సమయంలో తాను ఎలాంటి వివాదం సృష్టించకుండా మౌనంగా ఉన్నానని చెప్పుకొచ్చారు మమత మోహన్ దాస్. అయితే, ఈ సంఘటన జరిగిన కొన్ని వారాల తర్వాత, మమతా మోహన్‌దాస్‌కు రజినీకాంత్ గారి ఆఫీస్ నుంచి ఫోన్ వచ్చింది. స్వయంగా రజినీకాంత్ గారే ఫోన్‌లో మాట్లాడి, తన సమయాన్ని వృథా చేసినందుకు, ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడానికి వచ్చినందుకు ఆమెకు క్షమాపణలు చెప్పారని మమత తెలిపింది. "ఇది నా కంట్రోల్ ఉన్న ఏకైక విషయం. నా వంతుగా నేను చేయగలిగింది ఇదే" అని రజినీకాంత్ గారు చెప్పినట్లు మమత పేర్కొన్నారు. ఈ సంఘటనలో ఏదో తప్పు జరిగిందని, కానీ అది ఏమిటో తనకు ఎవరూ చెప్పలేదని మమత తెలిపారు. రజినీకాంత్ గారి ఈ వినయానికి, వృత్తిపరమైన మర్యాదకు తాను ఎంతో ప్రభావితమయ్యానని ఆమె అన్నారు. ఆయన ఒక సూపర్ స్టార్ అయి ఉండి కూడా వ్యక్తిగతంగా కాల్ చేసి క్షమాపణ చెప్పడం తనను ఎంతగానో ఆకట్టుకుందని మమత మోహన్ దాస్ తెలిపారు.

# కారు ఉన్నా నడపలేడు.. యాడ్స్‌లోనూ నటించలేడు..

ఐపీఎల్ 2026లో సంచలనం సృష్టించిన వైభవ్ సూర్యవంశీకి టాటా సియెర్రా కారు బహుమతిగా లభించినా, 15 ఏళ్ల వయసు కారణంగా దాన్ని నడపలేడు. మైనర్ కావడంతో కార్ల ప్రకటనల్లో నటించే అవకాశమూ ప్రస్తుతం అతడికి లేదు. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత భారత క్రికెట్‌లో ఎక్కడ చూసినా 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన ఈ వండర్ కిడ్.. టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో ఎన్నో రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ సీజన్‌లో కేవలం 16 మ్యాచ్‌లలోనే 48.50 యావరేజ్, 237.31 నాన్‌స్టాప్ స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించాడు. దాంతో అత్యధిక పరుగులు చేసినందుకు గానూ ప్రెస్టీజియస్ ఆరెంజ్ క్యాప్?తో పాటు మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ వంటి ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో ఏకంగా ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్‌లతో పాటు ఏషియన్ గేమ్స్‌కు కూడా భారత జట్టులోకి ఎంపికయ్యాడు.ఐపీఎల్‌లో సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కింద వైభవ్‌కు ఒక బ్రాండ్ న్యూ టాటా సియెర్రా ఎస్‌యూవీ కారు బహుమతిగా లభించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ కారును వైభవ్ నడపడానికి వీల్లేదు. ఎందుకంటే భారత మోటార్ వాహనాల చట్టం ప్రకారం.. ప్రైవేట్ కార్లు లేదా లైట్ మోటార్ వెహికల్స్ నడపాలంటే కనీసం 18 ఏళ్ల వయసు నిండి ఉండి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. వైభవ్‌కు ఇప్పుడు కేవలం 15 ఏళ్లే కావడం వల్ల, అతడు చట్టబద్ధంగా ఈ కారును రోడ్డుపైకి తీయలేడు. లైసెన్స్ రావడానికి ఇంకా మూడేళ్ల సమయం ఉంది కాబట్టి అప్పటివరకు అతడు ఆగాల్సిందే. ఈ కారు విషయమై రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమీ భిండర్ సోషల్ మీడియాలో వైభవ్‌తో ఒక సరదా ముచ్చట పెట్టారు. ఈ కారును ఏం చేస్తావ్? అని అడగ్గా.. వైభవ్ చాలా అమాయకంగా సమాధానమిచ్చాడు. "ఈ కారును మూడేళ్ల పాటు దాచి పెట్టుకుంటాను. ముందు నా డ్రైవింగ్ లైసెన్స్ రానివ్వండి, ఆ తర్వాతే డ్రైవింగ్ చేస్తాను. ప్రస్తుతానికి మా నాన్నను కారు నడపమని చెప్పి.. నేను పక్క సీట్లో కూర్చుని ముచ్చటపడతాను" అని నవ్వుతూ చెప్పాడు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఐపీఎల్ వల్ల వైభవ్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చినప్పటికీ అతడు కార్ల ప్రకటనలలో నటించడానికి వీల్లేదు. చట్టపరంగా మైనర్ అయినందున, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తి కార్ల యాడ్స్ లో నటిస్తే అది మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహించినట్లు అవుతుందని ఈ నిబంధన పెట్టారు. కేవలం కార్లే కాకుండా వయసుకు సంబంధించిన కొన్ని ఫైనాన్షియల్ సర్వీసెస్, గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, మెన్స్ గ్రూమింగ్ ప్రొడక్ట్స్ వంటి వాటి ప్రకటనలకు కూడా వైభవ్ దూరంగా ఉండాల్సిందే.




# బ్యాట్‌తో దుమ్మురేపిన సిరాజ్.. సెంచరీ చేసిన కేఎల్ రాహుల్ వల్లే కాలేదు అలాంటి షాట్!




ఆఫ్ఘనిస్తాన్‌తో మ్యాచ్‌లో టీమిండియా 564/8ఌ భారీ స్కోర్ చేసింది. మహ్మద్ సిరాజ్ కేవలం 12 బంతుల్లో 22 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. శుభమన్ గిల్ (126), కేఎల్ రాహుల్ (100) సెంచరీలు నమోదు చేశారు. సాయి సుదర్శన్, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్ కూడా రాణించారు.ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ చేసింది. 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అయితే ఈ మ్యాచ్‌లో మొహమ్మద్ సిరాజ్ బాల్‌తో కంటే ముందు బ్యాట్‌తో చిన్న పాటి విధ్వంసం సృష్టించాడు. ఇన్సింగ్స్ డిక్లేర్ చేయడానికి కొద్ది సేపు ముందు క్రీజ్‌లోకి వచ్చిన సిరాజ్.. టీమ్ స్కోర్ వీలైనంత ఎక్కువ పెంచాలనే ఉద్దేశంతో అల్ట్రా అగ్రెసివ్‌గా బ్యాటింగ్ చేశాడు. కేవలం 12 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్‌తో 22 పరుగులు చేసి.. టీమ్‌కు వ్యాల్యూబుల్ రన్స్ అందించాడు. సిరాజ్ ఆడిన ఈ ఇన్సింగ్స్‌లో మరో విశేషం ఏమిటంటే.. అతని స్ట్రైక్ రేట్. ఏకంగా 183.33 స్ట్రైక్ రేట్‌తో సిరాజ్ బ్యాటింగ్ చేశాడు. టీమిండియా ఇన్సింగ్స్‌లో మిగతా అందరికంటే సిరాజ్ స్ట్రైక్ రేటే ఎక్కువ. పైగా ఈ మ్యాచ్‌లో సెంచరీ చేసిన కేఎల్ రాహుల్, 81 రన్స్‌తో రాణించిన సాయి సుదర్శన్ సైతం ఒక్కటంటే ఒక్క సిక్స్ కూడా కొట్టలేకపోయారు. కానీ మియా భాయ్ మాత్రం ఓ భారీ సిక్సర్‌తో అందరిని షాక్‌కు గురి చేశాడు. అది కూడా మామూలు సిక్స్ కాదు.. మంచి టైమింగ్, టెక్నిక్‌తో సూపర్‌గా కొట్టాడు. సిరాజ్ బ్యాటింగ్ చూసి డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చున్న భారత క్రికెటర్లు ఆశ్చర్యపోయారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలి ఇన్సింగ్స్‌లో టీమిండియా 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ 177 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్స్‌తో 126, కేఎల్ రాహుల్ 165 బంతుల్లో 11 ఫోర్లతో 100 పరుగులు చేసి సెంచరీలతో కదం తొక్కారు. అలాగే సాయి సుదర్శన్ 81, రిషభ్ పంత్ 81 వాషింగ్టన్ సుందర్ 52 పరుగులు చేసి రాణించారు. తర్వాత తొలి ఇన్సింగ్స్‌కు దిగిన ఆఫ్ఘనిస్థాన్ ఆరంభంలోనే వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. తొలి మ్యాచ్ ఆడుతున్న మానవ్ సుతార్ భారత్‌కు తొలి వికెట్ అందించాడు. ప్రస్తుతం ఆఫ్ఘాన్ 98 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది. సుతార్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు పడగొట్టారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com